ప్రజాశక్తి
మంగళవారం 11 జూన్ 2024
8 పేజీలు





ఎన్‌టిఆర్ కృష్ణా



కృష్ణలంక 22వ డివిజన్ కట్టెల అర్తి వద్ద పేరుకుపోయిన చెత్త

పారిశుధ్యం... అస్తవ్యస్తం

- విజయవాడలో నిలిచిపోయిన చెత్త తరలింపు
- వర్షాలకు కుళ్లి కంపుకొడుతున్న వైనం
- సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం
- ఆందోళనలో నగర వాసులు
- పట్టని నగరపాలక సంస్థ

ప్రజాశక్తి-విజయవాడ

విజయవాడలో చెత్త నిర్వహణ అస్తవ్యస్తంగా సాగుతోంది. చెత్త తరలింపులో విజయవాడ నగరపాలక సంస్థ చేతులెత్తేయడంతో వీధుల్లో, ఇళ్లల్లో నుంచి సేకరించిన చెత్తను ట్రాన్స్‌ఫర్‌స్టేషన్స్‌కు తరలించే ప్రక్రియ మూలనపడింది. దీంతో ప్రతి డివిజన్‌లో చెత్త కుప్పలు పేరుకుపోయాయి. అడపాదడపా కురుస్తున్న వర్షాలకు చెత్త కుళ్లిపోతూ దుర్గంధపూరితమైన దుర్వాసనతో చుట్టుపక్కల నివాసులు ఉండలేకపోతున్నారు. అస్తవ్యస్తంగా తయారైన డ్రైనేజీ వ్యవస్థ, పేరుకుపోయిన సిల్టు, పారిశుధ్య నిర్వహణ, సిబ్బంది కొరతతో నగర వాసులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఎక్కడ విషజ్వరాలు ప్రబలుతాయోనని భీతిల్లిపోతున్నారు.

విజయవాడలో ఇప్పటికే నీటి కాలుష్యంతో అతిసార ప్రబలి మొగల్రాజపురం, పాయకాపురం ప్రాంతాల్లోని ప్రజలు వాంతులు, విరేచనాలతో రెండు వారాలకు పైగా బాధపడుతూ ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నారు. దీనికి తోడు ప్రస్తుతం డివిజన్ల నుంచి ట్రాన్స్‌ఫర్‌స్టేషన్‌కు చెత్త తరలించే 225 క్లాప్ ఆటో డ్రైవర్లు గత 25 రోజుల నుంచి సమ్మెలో ఉన్నారు. దీంతో ఎక్కడి వాహనం అక్కడే నిలిచిపోయింది. పెండింగ్ వేతనాలు నెలల తరబడి ఇవ్వకపోగా, పెరిగిన ధరలు, గత సమ్మెకాలం నాడు ఇచ్చిన హామీ మేరకు క్లాప్ ఆటో డ్రైవర్లకు వేతనాలు పెంచకపోవడంతో క్లాప్ ఆటో డ్రైవర్లు గత నెల రెండో వారం నుంచి మూకుమ్మడిగా సమ్మెలోనే ఉన్నారు. దీనిపై సంబంధిత ఉన్నతాధికారులు, నగర కమిషనర్, విఎంసి పాలకవర్గం, క్లాప్ ఆటోల నిర్వహణను కాంట్రాక్ట్ తీసుకున్న (మిగతా 2లో)

రాజకీయాలకు దూరంగా ఉంటా

'ఎక్స్' వేదికగా వెల్లడించిన మాజీ ఎంపి కేశినేని నాని

ప్రజాశక్తి-విజయవాడ

తాను ప్రత్యక్ష రాజకీయాల నుంచి తప్పుకుంటున్నట్లు విజయవాడ మాజీ ఎంపి, వైసిపి నేత కేశినేని శ్రీనివాస్ (నాని) సోమవారం 'ఎక్స్' వేదికగా తెలిపారు. రెండు సార్లు ఎంపిగా గెలిపించిన విజయవాడ ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ ప్రకటన విజయవాడ పార్లమెంట్ పరిధిలో తీవ్ర సంచలనం సృష్టించింది. అంతేగాక కేశినేని నాని అనుచరుల్లో తీవ్ర ఆందోళన, ఆవేదన వ్యక్తమైంది. విజయవాడ పార్లమెంట్ నుంచి టిడిపి తరుపున రెండు సార్లు కేశినేని నాని ఎంపిగా గెలిచారు. ఎన్నికలకు ముందు వైసిపిలో చేరి ఆ పార్టీ తరుపున విజయవాడ పార్లమెంట్ నుంచి పోటీ చేశారు. సొంత తమ్ముడు, టిడిపి అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని) చేతిలో 2.82 లక్షల భారీ తేడాతో నాని ఓటమి పాలయ్యారు. నాని తాననుకున్నది, తన ఆలోచనకు తట్టిన విషయాన్ని ముక్కుసూటిగా చెప్పడంతో పాటు పరుషంగా మాట్లాడతారనే చర్చ వైసిపిలో చేరడానికి ముందు వరకు కూడా తన అనుయాయుల్లోనే లేకపోలేదు. రవాణా శాఖ ఉన్నతాధికారులకు, కేశినేని నానికి మధ్య 2014లో చోటుచేసుకున్న గొడవ, ఘర్షణతో కేశినేని ట్రావెల్స్‌తో నడుపుతున్న సుమారు వంద బస్సులను సైతం ఆయన వదిలేసుకున్నారు. రెండు రోజుల ముందు మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని కలిసి కేశినేని మాట్లాడిన విషయం



తెలిసిందే. స్వయానా తన సోదరుడిపై భారీ మెజార్టీతో ఓడిపోవడం, దీర్ఘకాలంగా అన్నదమ్ముల కుటుంబాల మధ్య తగాదాలుండటం, వీరిద్దరి మధ్య ఉన్న గొడవులు ఇంకా పెద్దవి కావడానికి కొందరు వ్యక్తులు ఎగదోస్తూ... వారి పబ్బం గడుపుకుంటున్నారనే ఆలోచన...మరీ ముఖ్యంగా ఈ ఎన్నికలకు కొద్ది కాలం ముందు వరకు కూడా కేశినేని నాని వైపు ఉన్న టిడిపి శ్రేణుల్లో అత్యధిక మంది ప్రస్తుతం కేశినేని చిన్ని వైపు వెళ్లిపోవడం, ఈ ఎన్నికల్లో కనీసం ప్రతిపక్ష హోదా కూడా దక్కకుండా ఘోర ఓటమి చవిచూసిన వైసిపి దయనీయ స్థితి తదితర కారణాలతో కేశినేని నాని పూర్తిగా రాజకీయాల నుంచి తప్పుకున్నారనే చర్చ విజయవాడ నగరంలో జరుగుతుంది.

అధికారులు సమన్వయంతో పని చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న వీరపాండ్యన్

సిఎం ప్రమాణ స్వీకార ఏర్పాట్లపై వీరపాండ్యన్

వార్త 2లో

వైఎస్ఆర్ విగ్రహం ధ్వంసంపై ఫిర్యాదు

వార్త 3లో

కెయులో వైఎస్ఆర్ విగ్రహం తొలగించాలని వినతి

వార్త 7లో

ఉపాధ్యాయుల ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి

ఎంఎల్‌సి కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి-అవనిగడ్డ

చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులన్నీ భర్తీ చేయాలని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు కోరారు. స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో యుటిఎఫ్ మధ్యంతర కృష్ణాజిల్లా కౌన్సిల్ సమావేశం సోమవారం నిర్వహించారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు బి.కనకారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో లక్ష్మణరావు ప్రారంభ ఉపన్యాసం చేస్తూ ఐదు సంవత్సరాలకు ఒకసారి ఎన్నికలు జరుగుతాయని, కానీ ప్రజలు చరిత్ర నిర్మాతలు అనే విషయం మరోసారి రుజువు అయ్యిందన్నారు. 2019లో 151 సీట్లు ఇచ్చి జగన్మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసిన ప్రజలు ఆయన అవలంభించిన ప్రజా వ్యతిరేక విధానాల వల్ల ఉక్కుపాదంతో అణిచివేశారన్నారు. ప్రజాస్వామ్యం లేకపోవడంతో ప్రజల్లో అసహనం పెరిగిపోవడం వైసిపి ప్రభుత్వ పతనానికి దారితీసిందన్నారు. మొట్టమొదటిగా ప్రభుత్వాన్ని యుటిఎఫ్ నాయకత్వంలో ఉపాధ్యాయులు ఎదిరించారని, విజయవాడలో 2022లో జరిగిన ఉద్యమం వైసిపికి కనువిప్పు కలిగించిందని, అయినప్పటికీ ప్రభుత్వం మొండితనానికి పోయి ఉపాధ్యాయులపై కక్ష సాధింపు చర్యలకు పూనుకుందని తెలిపారు. అనేక ఉద్యమాలు యుటిఎఫ్ చేపట్టినప్పటికీ ప్రభుత్వం మాత్రం అణిచివేత ధోరణి అవలంభించిందన్నారు. సిపిఎస్ రద్దు జిపిఎస్‌కి వ్యతిరేకంగా పోరాటం, అంగన్వాడీ కార్యకర్తల 42 రోజుల సమ్మె వంటి ఉద్యమాలు జగన్ ఓటమికి కారణాలన్నారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన మోడీ కూడా 400 సీట్లు సాధిస్తామని తన మీడియా ద్వారా ప్రగల్భాలు పలికి అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని లౌకికవాదాన్ని మార్చేస్తామని, మత విభజనకు పూనుకునేందుకు ప్రకటనలు చేశారన్నారు. ఎగ్జిట్ పోల్స్ సైతం మోడీకి అనుకూలంగా ప్రకటనలు ఇచ్చినప్పటికీ ఆచరణలో సంకీర్ణ ప్రభుత్వమే ఏర్పడటంతో గతంలో మాదిరి నియంత్రత్వ పోకడలు ఆపాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని చెప్పారు. రాష్ట్రంలో అధికారంలోకి రాబోయే చంద్రబాబు ప్రభుత్వం విద్యారంగంపై ప్రత్యేక దృష్టి సాధించాలని, పాఠశాల విద్యకు ప్రమాదకరంగా మారిన జీవో



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్‌సి లక్ష్మణరావు

నెంబర్ 117ను తక్షణమే రద్దు చేయాలని కోరారు. మూడు, నాలుగు, ఐదు తరగతుల విలీనం రద్దు చేయాలని, ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులను కొనసాగించాలని, తెలుగు ఇంగ్లీష్ మీడియంలను ఎన్నుకునే అవకాశం విద్యార్థులకు కల్పించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం సిలబస్ విషయంలో తీసుకున్న అనాలోచిత విధానాలకు స్వస్తి పలకాలన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎ ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ త్వరలో (మిగతా 2లో)

మొదటిపేజీ తరువాయి

ఉపాధ్యాయుల ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి

కాకినాడలో యుటిఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి లెనిన్‌బాబు, కార్యదర్శి ఝాన్సీ హుస్సేన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భగీరథి, సిహెచ్.రాజగోపాల్‌రావు, టి.చలపతిరావు, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. యుటిఎఫ్ మండల గౌరవాధ్యక్షులు ఆంజనేయులు అతిథులను ఆహ్వానించగా అధ్యక్షులు జీవేంద్రరావు వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో తొలుత జాతీయ జెండాను, యుటిఎఫ్ జెండాలను ఆవిష్కరించారు.

పారిశుధ్యం అస్తవ్యస్తం

'స్వయంభూ' సంస్థ తమకేమీ పట్టదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. సమ్మెలో ఉన్న క్లాప్ ఆటో డ్రైవర్లతో చర్చలు జరపడంగానీ, వారి సమస్యలను ఆలకించడంగానీ, పెండింగ్ వేతనాలు మంజూరు చేయడంగానీ లేకపోవడంతో క్లాప్ ఆటో డ్రైవర్లు తాడోపేడో తేల్చుకునేందుకు సమ్మెను ఉధృతం చేశారు. డ్రైవర్ల న్యాయమైన పోరాటానికి ఎపి మునిసిపల్ కార్పొరేషన్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) మద్దతుగా నిలిచింది. ఇదే అంశంపై గత రెండు రోజుల క్రితం నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్‌ను కలిసి యూనియన్ నేతలు క్లాప్ ఆటో డ్రైవర్ల వేతనాల అంశాన్ని చర్చించారు. కమిషనర్‌లో ఉలుకుపలుకూ లేకపోగా క్లాప్ ఆటో డ్రైవర్ల సమస్య తమ పరిధిలోది కాదన్నట్లుగా మాట్లాడటం పట్ల క్లాప్ ఆటో డ్రైవర్లు, యూనియన్ నేతలు మండిపడుతున్నారు. చెత్త తరలించే వందలాది వాహనాలు ఒక్క సారిగా వారాల తరబడి పనిలో లేకపోవడంతో టన్నుల కొద్దీ చెత్త, ఇతర వ్యర్థాలు జనావాసాల నడుమ పేరుకుపోయి, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడే పరిస్థితి నెలకొంది. రోజుకు 600 టన్నులకు పైగా చెత్త నగరంలో ఉత్పత్తి అవుతుంది. వీధులు, ఇళ్లల్లో నుంచి సేకరించే చెత్తను క్లాప్ ఆటోల ద్వారా ప్రతి డివిజన్ పరిధిలోని ప్రధాన సెంటర్ పాయింట్‌కు తరలించి, అక్కడ నుంచి సింగ్‌నగర్‌లోని ఎక్సెల్‌ప్లాంట్, ఆటోనగర్‌లోని ట్రాన్స్‌ఫర్‌స్టేషన్‌కు తరలించి, వాటి దగ్గర నుంచి టెన్‌టైర్ల వాహనాల ద్వారా చిలకలూరిపేట సమీపంలోని నాయుడుపేట వద్ద ఉన్న విద్యుత్ ఉత్పత్తి కేంద్రానికి తరలిస్తారు. గత 25 రోజుల నుంచి క్లాప్ ఆటో డ్రైవర్లు ఆగిపోవడంతో చెత్త తరలింపు ప్రక్రియ మూలనపడింది. డివిజన్లలోని పేరుకుపోయిన చెత్త కుప్పలపై ఆవులు, పందులు, కుక్కలు చేరి చిందరవందర చేస్తున్నాయి. పరిసర ప్రాంతాల్లో దుర్వాసనతో కూడిన వాతావరణంలో అనారోగ్యం పాలవుతామోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్రంలో మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో గత వైసిపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన క్లాప్ ఆటోల వ్యవస్థను ఉంచుతారా లేదా రద్దు చేస్తారా అనేది ఇతమిద్ధంగా ఉందని నగరపాలక సంస్థ ఉన్నతాధికారులు చెబుతున్నారు. కేంద్రం విధించిన నిబంధనలకు లోబడి యూజర్ ఛార్జీలను భారీ మొత్తంలో నగరపాలక సంస్థ వసూలు చేస్తుంది. ప్రతి ఇంటి నుంచి, మధ్యతరగతి వర్గాలు, వ్యాపార సముదాయాల నుంచి సగటున రూ.120 నుంచి రూ.160, ఆపైన వేలకు వేల రూపాయలను ఎన్నికలకు ముందు వరకు కూడా నగరపాలక సంస్థ ముక్కుపిండి వసూలు చేసింది. ఎన్నికల కౌంటింగ్ పూర్తయిన వెంటనే చెత్త పన్ను వసూలు చేయరాదని మౌఖిక ఆదేశాలు ఇచ్చారు. ఈ ఆదేశాలు పూర్తి స్థాయిలో అమలవుతాయో లేదోనని నగర ప్రజలు సందేహాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా చెత్త తరలింపు ప్రక్రియ సజావుగా కొనసాగే విధంగా అధికారులు, విఎంసి పాలకవర్గం చర్యలు తీసుకోకపోతే నగరంలో పారిశుధ్యం లోపించి, ఈ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు చుట్టుముట్టే ప్రమాదం ఉందని నగర ప్రజలు తీవ్ర భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.



ప్రముఖుల పర్యటన నేపథ్యంలో బందోబస్తు కట్టుదిట్టం

పోలీస్ కమిషనర్ పిహెచ్‌డి.రామకృష్ణ



ప్రజాశక్తి-విజయవాడ: కృష్ణాజిల్లా గన్నవరం మండల పరిధిలోని కేసరపల్లి, ఐటీ పార్క్ వద్ద ఈనెల 12వ తేదిన నారా చంద్రబాబునాయుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయబోతున్న నేపథ్యంలో పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేసినట్లు నగర పోలీసు కమిషనర్ పిహెచ్‌డి రామకృష్ణ తెలిపారు. సోమవారం తన చాంబర్‌లో బందోబస్తు ఏర్పాట్లలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించిన పోలీసు కమిషనర్ అనంతరం మీడియాతో మాట్లాడారు. నగరంలో ఇతర రాష్ట్రాల గవర్నర్లు, కేంద్ర మంత్రులు, ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఇతర ప్రముఖులు, వి.వి.ఐ.పి.లు,అధికారుల పర్యటనల సందర్భంగా ఎటువంటి లోటుపాట్లు లేకుండా అన్ని శాఖల సమన్వయంతో ,పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేశామన్నారు.ఈ నెల 12న ప్రకాశం బ్యారేజ్ నుండి బెంజ్ సర్కిల్ వరకు, బెంజ్ సర్కిల్ నుండి రామవరప్పాడు వరకు, రామవరప్పాడు నుండి నిడమానూరు వరకు, ఏలూరు రోడ్డు మరియు బందర్ రోడ్డు పరిసర ప్రాంతాలలలో ఏర్పాటు చేస్తున్న కట్టు దిట్టమైన భద్రత, పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేశామన్నారు. అలాగే ప్రముఖుల పర్యటన వివరాలు, ఎస్కార్ట్, రూట్, పార్కింగ్ ప్రదేశాలు మొదలగు అంశాలపై అనుమతి (పాసులు) ఉన్న బస్సులను, వాహనాలను మాత్రమే అనుమతించడం జరుగుతుందన్నారు. కార్యక్రమానికి విచ్చేయు ప్రముఖులకు ప్రజలకు ట్రాఫిక్ పరంగా ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు,బందోబస్తు ఏర్పాట్లలో ఎక్కడా అలసత్వం ప్రదర్శించకుండా భద్రతా పరంగా ఎటువంటి చిన్న లోపాలు లేకుండా సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకొని తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులకు , సిబ్బందికి ఆదేశాలు జారీచేయడంతో పాటు, తగు సూచనలను అందించడం జరిగిందన్నారు.

ట్రాఫిక్ మళ్లింపు...

రామవరప్పాడు నుండి, ఇతర ప్రదేశాల నుండి గన్నవరం ఫంక్షన్ ప్లేస్ కు పాసులు ఉన్న బస్సులు/కార్లను మాత్రమే అనుమతించడం జరుగుతుంది. పాసులు లేని ఇతర వాహనాలు అనుమతించబడదు.విజయవాడలో ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియం, అంబేద్కర్ విగ్రహం వద్ద, బస్ స్టాండ్, రైల్వే స్టేషన్, లెనిన్ సెంటర్,.పటమట లోని జెడ్.పి.బాయ్స్ హై స్కూల్, అజిత్ సింగ్ నగర్ లోని మాకినేని బసవపున్నయ్య స్టేడియం, జింకానా గ్రౌండ్స్ ,.విధ్యధరపురం మినీ స్టేడియం ఈ ప్రాంతాల నుండి సి.ఎం. ప్రమాణ స్వీకర కార్యక్రామాన్ని ఎల్.ఈ.డి.స్క్రీన్ల ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేయడం జరుగుతుంది. ఆ చుట్టుపక్కల ప్రాంతాల వారు ఆయా ప్రదేశాలకు వెళ్లి కార్యక్రమాన్ని వీక్షించవచ్చని నగర సి.పి తెలిపారు.ఈ కార్యక్రమానికి విజయవాడ నగరంలో 3000 మంది , కష్ణా జిల్లాలో 7000 మంది పోలీసులతో బందోబస్త్ ఏర్పాట్లు చేయడం జరుగుతుందన్నారు.ఇతర రాష్ట్రాల గవర్నర్లు, ముఖ్యమత్రులు, కేంద్ర మంత్రులు, వి.వి.ఐ.పి.లు, వి.ఐ.పి.లు మరియు ప్రముఖులు ఈ రహదారుల గుండా ప్రయాణం చేస్తారు కావున వారికి ట్రాఫిక్ పరంగా మరియు భద్రతా పరంగా ఎటువంటి ఇబ్బందులు లేకుండా తగిన బందోబస్త్ ఏర్పాట్లు చేసామని, ప్రశాంత వాతావరణంలో పాసులు కలిగిన ఆహ్వానితులు సభా స్థలానికి చేరుకునే విధంగా ఏర్పాట్లు చేశామన్నారు.ప్రముఖులు పర్యటించు రహదారుల వెంబడి రద్దీని గుర్తించెందుకు ముఖ్య ప్రదేశాలలో సి.సి.కెమెరాలను ఏర్పాటు చేయడం మరియు డ్రోన్ కెమెరాల ద్వారా రద్దీని పర్యవేక్షిస్తూ ఎప్పటికప్పుడు తగు సుచనలు చేసేవిధంగా ఏర్పాట్లు చేశామన్నారు.

ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యత : కొలికపూడి



ప్రజాశక్తి-తిరువూరు: ఉద్యోగుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని తిరువూరు శాసనసభ్యులు కొలికపూడి శ్రీనివాసరావు అన్నారు. ఆంధ్రప్రదేశ్ నాల్గో తరగతి ఉద్యోగుల సంక్షేమ సంఘం, ఎపి నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం హౌస్ బిల్డింగ్ సొసైటీ పాలకమండలి ఆధ్వర్యంలో తిరువూరులోని కార్యాలయంలో ఎమ్మెల్యే శ్రీనివాసరావును నాయకులు కలిసి ఎన్నికల్లో గెలుపొందినందుకు అభినందనలు తెలిపారు. శాలువాతో సత్కరించి పూలబకేను అందజేశారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సొసైటీ అధ్యక్షులు మహ్మద్ రఫీ మాట్లాడుతూ గతంలో టిడిపి ప్రభుత్వ హయాంలో ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చారని గుర్తుచేశారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా ఆ దిశగా కషిచేయాలని సూచించారు. ఉద్యోగుల సంక్షేమం, గహవసతి కల్పన, ఇతర సంక్షేమ పథకాల వర్తింపుపై దష్టిసారించాలని విజ్ఞప్తిచేశారు. దీనికి ఎమ్మెల్యే కొటికలపూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజలకు నిరంతరం సేవలు చేసే ఉద్యోగులు, తమ యావత్‌జీవితం ప్రజల సంక్షేమం కోసం పాటుపడిన విశ్రాంత ఉద్యోగుల సంక్షేమానికి తమ శక్తివంచన లేకుండా ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ వైస్ ప్రెసిడెంట్ కె.సాయిబాబు, డైరెక్టర్లు ఎన్.విలియం, జి.విశ్వేశ్వరరావు, నాగారపు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పని చేయాలి

సిఎం ప్రమాణ స్వీకార ఏర్పాట్లపై వీరపాండ్యన్

ప్రజాశక్తి-గన్నవరం: ఈ నెల 12న కేసరపల్లి గ్రామంలోని ఐటి పార్క్ సమీపంలో రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని కార్యక్రమ ప్రత్యేక అధికారి జి.వీరపాండ్యన్ సూచించారు. సోమవారం కార్యక్రమ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో కార్యక్రమ సమన్వయ ఉన్నతాధికారులతో కలిసి గ్యాలరీల ఇన్‌ఛార్జీలతో చర్చించారు. విధుల నిర్వహణకు సంబంధించి స్పష్టమైన మార్గనిర్దేశం చేశారు. మూడు కేటగిరీల్లో మొత్తం 36 గ్యాలరీలు ఉంటాయని, ప్రజాప్రతినిధులు, వారి కుటుంబసభ్యులు, న్యాయమూర్తులు, అఖిల భారత సర్వీసుల అధికారులు, ప్రత్యేక అతిథులు, వీవీఐపీలు, వీఐపీలు, మీడియా ప్రతినిధులు తదితరులకు సంబంధించిన గ్యాలరీల విధుల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రణాళిక ప్రకారం అతిథులకు సేవలందించాలని సూచించారు. ప్రతి గ్యాలరీకి వాటర్, శానిటేషన్, మెడికల్ టీమ్ ఉంటాయని తెలిపారు. ఈ బృందాల సభ్యులను గ్యాలరీల ఇన్‌ఛార్జులు సమన్వయం చేసుకోవాలన్నారు. డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారులు గ్యాలరీలకు ఇన్‌ఛార్జులుగా వ్యవహరిస్తారని వివరించారు. ఎక్కడా ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా విధులు నిర్వహించాలని సూచించారు. ప్రధానమంత్రి కార్యక్రమానికి హాజరవుతున్న నేపథ్యంలో ఎస్పీజీ భద్రత ఉంటుందని, అందువల్ల భద్రతా మార్గదర్శకాలకు అనుగుణంగా వ్యవహరించాలని చెప్పారు. ఈ సమావేశంలో వివిధ జిల్లాల జాయింట్ కలెక్టర్లు, మునిసిపల్ కమిషనర్లు, సబ్ కలెక్టర్లు, ఆర్డీవోలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం



శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-పెడన : విద్యార్థులు స్వచ్ఛంద సంస్థల ప్రోత్సాహంతో అన్ని రంగాల్లోనూ ముందుండాలని రిటైర్డ్ డిఈఓ మట్టా రాధాకృష్ణమూర్తి ఆకాంక్షించారు. సోమవారం స్థానిక 18 వ వార్డులోని సహాయ ఫౌండేషన్ కార్యాలయంలో వేసవి సెలవుల్లో కంప్యూటర్ నేర్చుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు ఆయన ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కష్ణమూర్తి మాట్లాడుతూ సహాయ ఫౌండేషన్ ఆధ్వ ర్యంలో పేదలకు చేస్తున్న పలు సహాయ, సహాయార్థం గురించి కొనియాడారు. సహాయం కోసం అరులు చాచే ప్రతి ఒక్కరికి మేమున్నామంటూ సహాయాన్ని అందించడం పట్ల కతజ్ఞతలు తెలిపారు. ఇందులోని భాగంగానే వేసవికాలంలో చదువుకునే విద్యార్థులు ఆటకాయి తనంగా కాలాన్ని వెలదీయకుండా పెడన, మచిలీపట్నం పరిసర ప్రాంతాల్లోని విద్యార్థులకు కంప్యూటర్ పై శిక్షణ ఇప్పించి వారిలోని ప్రతిభను వెలుకి తీయడం హర్షించదగ్గ విషయం అన్నారు. ఆ సంస్థ అధ్యక్షుడు మహమ్మద్ ఉస్మాన్ భాష మాట్లాడుతూ ఉన్నత స్థాయిలో ఉన్న వారు తమ సంస్థ ద్వారా పేదలకు సహాయం చేయడానికి ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో కంప్యూటర్ శిక్షకులు సత్యనారాయణ, సంస్థ ఉపాధ్యక్షులు మామిడి ప్రసాద్, కాగిత సాంబశివరావు, మహిళా విభాగం అధ్యక్షురాలు కోన వెంకటేశ్వరమ్మ, విన్నకోట సంధ్య, నూర్జహాన్, మాజేటి లక్ష్మీకాంతం తదితరులు పాల్గొన్నారు.



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న వైసిపి నాయకులు

వైఎస్ఆర్ విగ్రహం ధ్వంసంపై ఫిర్యాదు

ప్రజాశక్తి-పమిడిముక్కల : వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని గోపువానిపాలెంలో గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేయడం దారుణమని వైయస్సార్ పార్టీ మండల అధ్యక్షులు ఎలమంచిలి గణేష్ అన్నారు. విగ్రహం ధ్వంసంపై సోమవార పమిడిముక్కల మండలంలోని వీరంకి లాకులు వైయస్సార్ పార్టీ నాయకులు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. తెలుగుదేశం పార్టీ నాయకులు చేస్తున్న విధ్వంసం ఆపాలని, మండలంలోని వైఎస్ఆర్ పార్టీ విగ్రహాలకు రక్షణ కల్పించాలని కోరారు ఈ కార్యక్రమంలో పాతురు చంద్రపాల్, తిరుమల శెట్టి బోసు బాబు, కొడమంచిలి మహేష్, గంజాల సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

దాడులకు తెగబడే సంస్కృతి వైసిపిదే

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : బందర్లో గంజాయి బ్యాచ్ ని ప్రోత్సహించి దాడులకు పురుకొల్పిందే పేర్ని కిట్టు అన్న విషయం ప్రజలు ఎప్పటికీ మర్చిపోరని పలువురు టిడిపి, జనసేన నేతలు పేర్కొన్నారు. మాజీ మంత్రులు పేర్ని నాని, కొడాలి నాని విమర్శలకు సోమవారం స్థానిక నియోజక వర్గ తెదేపా కార్యాలయంలో నిర్వహించిన విలేఖర్ల సమావేశంలో ఇరు పార్టీల నేతలు టీడీపీ సీనియర్ నేత, కష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపిచంద్, మచిలీపట్నం నియోజకవర్గ జనసేన ఇంచార్జ్ బండి రామకష్ణ లు మాట్లాడుతూ గత ఐదేళ్లుగా తెలుగుదేశం, జనసేన నాయకులు కార్యకర్తలపై దాడులకు తెగబడింది ఎవరో మచిలీపట్నంలో ప్రతి ఒక్కరికి తెలుసన్నారు. పేర్ని నాని, కొడాలి నానిలు తమపై అసత్య ఆరోపణలు చేస్తున్నరన్నారు. దాడులకు తెగబడే సంస్కృతి మాది కాదని మీది అన్న విషయాన్ని పేర్ని నాని, కొడాలి నాని గుర్తు పెట్టుకుంటే మంచిదనీ హెచ్చరించారు. గత ఐదేళ్లలో వైకాపా చేసిన అరాచకాలను మీడియా ముఖంగా బయటపెట్టారు. ఇంకా సిగ్గు లేకుండా ఏ విధంగా అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓటమిని జీర్ణించుకోలేక వైసీపీ శ్రేణులు అక్కస్సుతో తమ పార్టీ నేతలు, కార్యకర్తలపై వైసీపీ కార్యకర్తలు దాడులకు పాల్పడుతున్నరన్నారు. ఈసవేశంలో పలువురు టిడిపి,జన సేన నాయకులు పాల్గొన్నారు.



రాష్ట్ర ఆర్యవైశ్య కమిటి సభ్యులుగా ఎన్నికైన తాడిపరి, రఘుబాబులకు నియామక ప్రతాలు అందజేస్తున్న దృశ్యం

నియామకపత్రాలు అందజేత

ప్రజాశక్తి - గుడివాడ : ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కమిటీ సభ్యులుగా గుడివాడకు చెందిన తాడిపర్తి శ్రీనివాస్, జిల్లా రఘుబాబులు నియమితులయ్యారు. సోమవారం స్థానిక ఆర్యవైశ్య కార్యాలయంలో ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షులు చిన్ని రామ్సత్యనారాయణ నియామక పత్రాలను యక్కలి మణిదీప్ ఆధ్వర్యంలో తాడిపర్తి శ్రీనివాస్, జిల్లా రఘుబాబులకు అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు చిన్ని మాట్లాడుతూ ఆర్య వైశ్యులు అభివద్ధికి పాటు పడాలని కోరారు. అనంతరం పలువురు ప్రముఖులు తాడిపర్తి శ్రీనివాస్, జిల్లా రఘుబాబులను అభినందించారు.

వృద్ధులకు అన్నదానం

ప్రజాశక్తి - గుడివాడ : శ్రీ కృష్ణ యాదవ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు పుట్టి హరికుమార్ ఆధ్వర్యంలో సోమవారం శాంతి వద్ధాశ్రమంలోని వృద్ధులకు అన్నదానం పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హరికుమార్ మాట్లాడుతూ నరిపల్లి శ్రీనివాసరెడ్డి అపర్ణల కుమార్తె మీనాక్షిప్రియారెడ్డి 8వ పుట్టినరోజు సందర్భంగా వృద్ధులకు అన్నదానం, పండ్లు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య ప్రముఖులు బొగ్గరపు తిరుపతయ్య, నవభారత్ ఖాదీ స్టోర్స్ అధినేత సయ్యద్ గఫార్, మాకుల సత్యం, సభ్యులు కంతేటి హరిబాబు, జాజుల తాతారావు తదితరులు పాల్గొన్నారు.




వృద్ధులకు అన్నదానం చేస్తున్న దృశ్యం

రోడ్డు ప్రమాదంపై కొల్లు రవీంద్ర విచారం

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : మచిలీపట్నం రూరల్ చిన్నాపురం గ్రామానికి చెందిన బొందిలి సునీత్ భాయ్ (45), పి సాయి సింగ్ (06) మతి చెందడం, మరో నలుగురు నూజివీడు మండలం గొల్లపల్లి సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడటంపై మచిలీపట్నం నియోజక`వర్గ శాసనసభ్యులు కొల్లు రవీంద్ర తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ప్రమాద వార్త తెలుసుకున్న వెంటనే రవీంద్ర.. నూజివీడు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి తో మాట్లాడి అధికారులతో ద్వారా సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను విజయవాడ తరలించగా మెరుగైన వైద్య సేవలకు ఆదేశించారు. మతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని ఎమ్మెల్యే కొల్లు రవీంద్ర తెలియజేశారు.

వైసిపి కార్యాలయాన్ని స్వాధీనం చేసుకోవాలి : జనసేన

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : కోట్ల రూపాయలు ఖరీదు చేసే ప్రభుత్వ స్థలంలో అక్రమంగా నిర్మించిన మచిలీపట్నం వైఎస్ఆర్ పార్టీ కార్యాలయం భవనాన్ని తక్షణమే స్వాధీనం చేసుకుని భోగరాజు పట్టాభి సీతారామయ్య భవనంగా మార్పు చేయాలని కష్ణా జిల్లా జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి లంకిశెట్టి బాలాజీ అన్నారు. నియమ నిబంధనలకు వ్యతిరేకంగా ప్రభుత్వ నిబంధనలను తుంగలోకి తొక్కి ఏకపక్షంగా మచిలీపట్నం ఈడేపల్లిలో జిల్లా జడ్జి బంగ్లా ఎదురుగా నిర్మించిన ప్రారంభం కానీ వైయస్సార్ పార్టీ కార్యాలయం భవనాన్ని తక్షణమే జిల్లా కలెక్టర్ స్వాధీనం చేసుకుని భోగరాజు పట్టాభి సీతారామయ్య భవనంగా మార్పు చేయాలని కోరారు. సోమవారం మచిలీపట్నం లో విలేకరులతో మాట్లాడుతూ కోట్ల రూపాయలతో నిర్మించిన టిడికో ఇళ్లను లబ్ధిదారులకు అందజేయకుండా కాలయాపన చేసి కేవలం నెలల వ్యవధిలో ఏకపక్షంగా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన వైఎస్ఆర్ పార్టీ కార్యాలయమును తక్షణమే స్వాధీనం చేసుకోవాలని,ప్రజల ఆస్తిని ప్రభుత్వ ఆస్తులను రక్షించాలని బాలాజీ డిమాండ్ చేశారు.



మచిలీపట్నంలోని వైసిపి కార్యాలయం

బాలకృష్ణ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-చల్లపల్లి : ప్రముఖ సినీ నటుడు హిందూపురం శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణ పుట్టినరోజు వేడుకలను సోమవారం స్థానిక టిడిపి కార్యాలయం వద్ద ఘనంగా నిర్వహించారు. చల్లపల్లి ఎంపీపీ కోట విజయరాధిక, వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, మాజీ డీసీ చైర్మన్ నిడమానూరి దిలీప్ కుమార్, మాజీ వైస్ ఎంపీపీ బోలెం నాగమణి లు కేక్ కట్ చేశారు. ఉప సర్పంచ్ ముమ్మనేని రాజకుమార్ (నాని), ఎంపీటీసీ సభ్యురాలు పైడిపాముల స్వప్న, టీడీపీ రాష్ట్ర నేతలు జల్లూరు ప్రసాద్, మోర్ల ప్రసాద్, రావి చిట్టి, జిల్లా నేత మోర్ల శివ, వార్డు సభ్యులు అంబటి భువనేశ్వరరావు, షేక్ సిలార్, పట్టణ టీడీపీ అధ్యక్షుడు షేక్ నబీఘోరీ పాల్గొన్నారు. **ప్రజాశక్తి-అవనిగడ్డ :** అవనిగడ్డలోని టిడిపి కార్యాలయంలో బాలకృష్ణ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కేకును కట్ చేసి నాయకులు కార్యకర్తలకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు మాచవరపు ఆదినారాయణ, పార్టీ నాయకులు బచ్చు రఘునాథ్, లుక్కా పిచ్చయ్య ,బచ్చు మల్లికార్జున రావు, గుంటూరు వినయ్, దాసినేని శ్రీనివాసరావు, కంచర్ల ఆనంద్, పులిగడ్డ నాంచారయ్య, మెరుగు సోమిరెడ్డి, దాసినేని సాంబయ్య తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-కంకిపాడు :** కంకిపాడు మండలం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో విక్రమ్, వెంకట్ ఆధ్వర్యంలో నందమూరి బాలకష్ణ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ యువ నాయకులు బోడే వెంకట్ రామ్ ముఖ్యఅతిథిగా విచ్చేసి తెలుగుదేశం నాయకులతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో కంకిపాడు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సూదిమల్ల రవీంద్ర ప్రసాద్, సీనియర్ నాయకులు తుమ్మలపల్లి హరికష్ణ, పులి శ్రీనివాసరావు, బప్పుడి శివరామకష్ణ, కొండ నాగేశ్వరరావు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-ఘంటసాల :** ఘంటసాల మండలం కొడా లిలో తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద సోమవారం బాలకష్ణ జన్మదిన వేడుకలను బాలకష్ణ అభిమాని తుమ్మల శివరాం ప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మొవ్వ మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ తుమ్మల జనార్దన్ బాబు, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు తుమ్మల చౌదరిబాబులు కట్ చేసి అభిమా నులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కంఠమనేని రాజగోపాల్ పరుచూరి శ్రీనివాస్, గోగినేని కష్ణయ్య, కంఠమనేని దిశోన్, పట్టాభి, కొడాలి లక్ష్మణరావు, బండి యశ్వంత్, జాస్తి బుల్లయ్య, మొవ్వ కోటేశ్వరావు, మట్ట రాజారావు, బాలకష్ణ అభిమానులు తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గుడ్లవల్లేరు :** మండలంలోని కవుతరం గ్రామంలో సినీ హీరో నందమూరి బాలకష్ణ, స్థానిక టిడిపి పార్టీ నాయకుడు మల్లిపెద్ది సుబ్రహ్మణ్యం చౌదరి జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గుడివాడ నియోజకవర్గం ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పాల్గొని కేక్ కట్ చేశారు. గ్రామంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహం వద్ద జన్మదిన వేడుకలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వల్లభనేని వెంకట సుబ్బారావు, కంచర్ల సుధాకర్, తూము పద్మజ, నాంజి బాబు, మద్దాల జోజి తదితరులు పాల్గొన్నారు.



గుడ్లవల్లేరులో...



కంకిపాడులో...


దాత కుటుంబానికి అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఇఒ రామారావు

అన్నదానానికి విరాళం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రి దుర్గమ్మ ఆలయంలో ప్రతిరోజూ జరుగు నిత్యాన్నదానం పథకానికి నరసన్నపాలెం, నూజివీడు, కృష్ణా జిల్లాకు చెందిన దాత గూడూరు లీల వెంకట సత్య సుభాష్ మరియు కుటుంబ సభ్యులు రూ.1,10,116లను దేవస్థానం నందు జరుగు అన్నదానం నిమిత్తం ఆలయ ఇఒ కె.ఎస్.రామారావును సోమవారం కలిసి దేవస్థానానికి విరాళం అందజేశారు. దాత కుటుంబానికి ఆలయ అధికారులు అమ్మవారి దర్శనం కల్పించగా, వేదపండితులు వేదాశీర్వచనం చేయగా, ఆలయ అధికారులు అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం అందజేశారు.


పురస్కారం అందుకుంటున్న వినయ్ కుమార్

న్యాయమూర్తి చేతులమీదుగా పురస్కారం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : పశ్చిమ నియోజకవర్గం వన్‌టౌన్‌లో ఉంటూ, హోమ్‌గార్డు విధులు నిర్వహిస్తూ, మరోపక్క న్యూ జనరేషన్ యూనిటీ ఆర్గనైజేషన్‌ను స్థాపించి తద్వారా ఎంతోమంది పేదలకు, పిల్లలకు, అనాథలకు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు తనవంతు సేవలందిస్తూ ముందుకు సాగుతున్న ఆర్గనైజేషన్ వ్యవస్థాపక కార్యదర్శి వినయ్‌కుమార్ సేవలు నిరుపమానమని హైకోర్టు న్యాయమూర్తి డాక్టర్ వీఆర్‌కె కృపాసాగర్ అన్నారు. కొత్తపేట, పొట్టి శ్రీరాములు చలువాది మల్లికార్జునరావు ఇంజనీరింగ్ కాలేజీలో ఆదివారం రాత్రి అన్నసంతర్పణ సేవాసమితి అధ్యక్షులు గుండు దిలీప్‌కుమార్ ఆధ్వర్యంలో మూడో వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా హైకోర్టు న్యాయమూర్తి డాక్టర్ వి.ఆర్.కె కృపాసాగర్ పాల్గొని న్యూ జనరేషన్ యూనిటీ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక కార్యదర్శి గొడ్డంటి వినయ్‌కుమార్ సేవలకు గాను ఉగాది పురస్కారాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి గొడ్డంటి సాయి వినయ్ కుమార్ హోమ్‌గార్డ్‌గా విధి నిర్వహిస్తూ, తన తండ్రి జ్ఞాపకార్థంగా సేవ చేయాలనే సంకల్పంతో రోజుకు రూపాయి, నెలకు మూడు రూపాయలతో సంస్థ ద్వారా సేవ కార్యక్రమాలు చేస్తూ సుమారు లక్ష మందికి పైగా అన్నదానం, లాక్‌డౌన్‌లో ఇతర ప్రత్యేక రోజుల్లో చిన్నారి మనసు (చిల్డ్రన్స్ డే), అమ్మ మనసు (మదర్స్ డే), ఆత్మీయ చేయూత వంటి కార్యక్రమాలు నిర్వహించటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులు డాక్టర్ జి.సమరం, గవర్నర్ వాసవి క్లబ్ కొత్త గణేష్ బాబు, అన్నసంతర్పణ సేవా సమితి వ్యవస్థాపక కార్యదర్శి గుండు దిలీప్ పాల్గొన్నారు.

వేణుగోపాల స్వామిని దర్శించుకున్న ఎంఎల్ఎ

ప్రజాశక్తి - గంపలగూడెం: నెమలి శ్రీ వేణుగోపాల స్వామివారిని తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస రావు సోమవారం దర్శించు కున్నారు. ఎన్నికల నేపథ్యంలో అఖండ విజయాన్ని సాధించుకున్న సందర్భంగా, ఎంఎల్ఎ మొక్కును చెల్లించుకున్నారు. ఆలయ పురోహిత బృందం స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందజేశారు.


దర్శనానికి వచ్చిన కొలికపూడి

భాషా నైపుణ్యం చాలా కీలకం

ప్రజాశక్తి - వన్‌టౌన్ :

విద్యార్థులు విజయాలను సాధించాలంటే వారిలోని భాషా నైపుణ్యాలు చాలా కీలకమని కాకరపర్తి భావనారాయణ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు అన్నారు. ది అచీవర్స్ అకాడమి ప్రచురించిన వాణిజ్య శాస్త్ర అధ్యాపకులు పి.మురళీధర్ రచన 'స్పోకెన్ ఇంగ్లీష్' పుస్తకాన్ని డాక్టర్ నారాయణరావు కళాశాల ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తమతమ రంగాలకు సంబంధించిన సంపూర్ణ విజ్ఞానం ఉన్నప్పటికీ భాషా వారి భవితను ప్రభావితం చేయటంలో ప్రముఖ పాత్ర పోషిస్తుందన్నారు. పాఠశాల విద్యార్థులు ఆంగ్లంలో అనర్గళంగా మాట్లాడగల సామర్థ్యం కేవలం విద్యా నైపుణ్యం మాత్రమే కాదన్నారు. భాషా నైపుణ్యం విద్య, వృత్తి, వ్యక్తిగత అభ్యున్నతిలో లెక్కలేనన్ని అవకాశాలకు అస్కారమి స్తుందన్నారు. ఈ పుస్తకం విద్యార్థులకు ఆంగ్ల భాషపై మరింత


'స్పోకెన్ ఇంగ్లీష్' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ నారాయణరావు తదితరులు

పట్టు సాధించేందుకు ఉపయుక్తంగా ఉంటుందన్నారు. రచయిత పి.మురళీధర్‌ను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, పీజీ డైరెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేష్, అధ్యాపకులు కె ప్రకాష్, రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సర్వేలో మండల విద్యాశాఖాధికారి

ప్రజాశక్తి - విస్సన్నపేట : విస్సన్నపేట మండలంలోని అన్ని గ్రామాల పరిధిలో వికలాంగ బాలబాలికల నమోదు కోసం ఐఇఆర్‌పిలతో ప్రత్యేక సర్వే నిర్వహించి 19 మంది బాల బాలికలను గుర్తించినట్లు మండల విద్యాశాఖాధికారి ఈ.సుధాకర్ తెలిపారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ ప్రభుత్వం వారు ప్రత్యేక అవసరాల పిల్లల కోసం భవిత కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రత్యేక విద్యను అందిస్తున్నారు. ప్రతి సోమవారం భవిత కేంద్రంలో అవసరమైన విద్యార్థులకు ఫిజియోథెరపీ నిర్వహిస్తున్నారు. అవసరమైన విద్యార్థులకు మెడికల్ క్యాంపులు నిర్వహించి వారికి కావాల్సిన ఉపకరణాలు అందిస్తున్నారు. సంవత్సరానికి ఒకసారి స్కాలర్ షిప్స్ అందిస్తారని అన్నారు. ప్రత్యేక అవసరాలు గల బడి వయస్సు పిల్లలందరూ భవిత కేంద్రం లేదా స్థానిక పాఠశాలలో నమోదు అవ్వాలని తెలిపారు. ప్రతి


సర్వేలో పాల్గొన్న అధికారి సుధాకర్

తల్లిదండ్రులు వికలాంగ బాల బాలికలను అభివృద్ధి పథంలో నడిపేందుకు తమ వంతు కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఐఇఆర్‌పి ఉపాధ్యాయులు ఎం.కృష్ణ ప్రసాద్, డి.రాముడు పాల్గొన్నారు.

ఒంటెద్దు పోకడ వల్లే పతనం

ప్రజాశక్తి - తిరువూరు :

జగన్ మోహన్ రెడ్డి అహంకారం, ఒంటెద్దు పోకడవల్లే వైసిపి ఘోర పతనానికి కారణమని మాజీ ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి అన్నారు. ఆయన వల్లే తిరువూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయలేకపోయానని ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం తిరువూరు లోని తన నివాసంలో రక్షణ నిధి విలేకర్లతో మాట్లాడుతూ నేను వైసిపి నుండి తిరువూరు నియోజకవర్గంలో ఒకసారి ప్రతిపక్ష ఎమ్మెల్యేగా, రెండోసారి అధికారపక్ష ఎమ్మెల్యేగా కొనసాగానని, మూడోసారి టికెట్ తనకేనని చెప్పిన అధిష్టానం ఐప్యాక్ సర్వే రిపోర్ట్ పేరుతో నన్ను పక్కనపెట్టడం దారుణమన్నారు. ఐదేళ్లలో జగన్ ప్రజలకు చేసింది ఏమీలేదని, బటన్ నొక్కుడు తప్ప రాష్ట్రానికి మిగిలింది శూన్యమేనని రక్షణనిధి అన్నారు. జగన్ వల్ల తాను తిరువూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్య మంత్రిగా తిరువూరు వచ్చిన జగన్ కు


మాట్లాడుతున్న రక్షణ నిధి

పలు ముఖ్యమైన సమ స్యలను తెలియజేస్తే వాటి పరిష్కారానికి ఇచ్చిన హామీలు నీటి మూటగానే మిగిలిపోయాయని ఆరోపించారు. 2023 డిసెంబర్ నుంచి వైసిపికి దూరంగా ఉన్నానన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో తిరువూరు, పామర్రు నియోజకవర్గాల్లో ఓటమి అభ్యర్థులు గెలుపుకోసం కృషి చేశానన్నారు. ఏ పార్టీలో చేరతానన్నది త్వరలోనే ప్రకటి స్తానని రక్షణనిధి చెప్పారు.

విటిపిఎస్ ఎ కాలనీలో చోరీ

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం

ఇబ్రహీంపట్నం మండలం విటిపిఎస్ ఏ కాలనీలో దొంగలు ఇంట్లో చొరబడి బీరువా తెరిచి బట్టలు చెల్లాచెదురుగా పడేసి బంగారం, వెండి వస్తువులు, నగదు ఎత్తుకు వెళ్ళినట్లు విటిపిఎస్ రిటైర్ ఉద్యోగి రెడ్డమ్మ తెలిపారు. గుడివాడలోని బంధువుల ఇంట్లో శుభకార్యానికి వెళ్ళి తిరిగి రాగా ఇంటి తలుపులు తెరిచి ఉండి, లైట్లు వేసి ఉన్నాయన్నారు. చోరీ విషయం స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

లోకేష్ చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో పంజా సెంటర్‌లో విజయవాడ పశ్చిమ నియోజకవర్గ మైనారిటీ సెల్ అధ్యక్షులు ఎం.డి రెజాఉల్లాహ్ ఆధ్వర్యంలో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి, మంగళగిరి నియోజకవర్గ శాసనసభ్యులు నారా లోకేష్ ముస్లిం మైనారిటీలకు నాలుగు శాతం రిజర్వేషన్‌లపై ఇచ్చిన హామీ నెరవేరుస్తామని చెప్పిన సందర్భంగా సోమవారం పంజా సెంటర్‌లో లోకేష్ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పశ్చిమ నియోజకవర్గం సీనియర్ మైనారిటీ నాయకులు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎం.ఎస్.బేగ్ పాల్గొని మాట్లాడుతూ జూన్ 4వ తేదీన ఎన్డీయే కూటమి ఘన విజయం సాధించిన తర్వాత అటు కేంద్రంలోనూ ఇటు రాష్ట్రంలోనూ ఒక మంచి సుపరిపాలన రాబోతుందని ప్రజలందరు విశ్వసించి మనకు అధికారం


నారా లోకేష్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మైనార్టీ నాయకులు బేగ్, తదితరులు

ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ సెల్ అధ్యక్షులు ఎమ్.డి.రెజాఉల్లాహ్, డివిజన్ అధ్యక్షులు సయ్యద్ సలీం, మైనారిటీ నాయకులు, టిడిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.



దుర్గమ్మను దర్శించుకున్న కరికల్ వలవెన్

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానము, ఇంద్రకీలాద్రి దుర్గమ్మ దర్శనార్థం రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.కరికల్ వలవెన్ సోమవారం విచ్చేశారు. ఆలయ కార్య నిర్వాహణాధికారి కె.ఎస్.రామారావు వీరికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం వీరికి ఆలయ వేదపండితులు వేదాశీర్వచనం చేయగా ఆలయ కార్యనిర్వహణాధికారి అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదం, చిత్రపటం అందజేశారు.


నాట్లు వేస్తున్న కూలీలు

వర్షంతో పనుల్లోకి రైతులు

ప్రజాశక్తి - కంచికచర్ల : కంచికచర్ల పరిసర ప్రాంతాల్లో సోమవారం భారీ వర్షం కురిసింది. గత కొద్దిరోజులుగా పొడిగా ఉన్న వాతావరణం సోమవారం మధ్యాహ్నానికి మేఘావృతమై భారీ వర్షం కురిసింది. మృగశిర కార్తె ఆరంభమై రోజులు గడుస్తున్న సరైన వర్షాలు లేకపోవడంతో రైతులు వర్షాల కోసం ఆకాశం వంక ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం రైతులు పొలాల పనుల్లో బిజీగా ఉన్నారు. పొలాల్లో విత్తనాలు నాటేందుకు రైతులు తమ భూములను దుక్కులు తోలి చదును చేసి ఇప్పటికే సిద్ధం చేశారు. ఈ పరిస్థితుల్లో వరుణుడు కరుణించి సోమవారం వర్షం కురియడంతో రైతులు వెంటనే భూముల్లో విత్తనాలు చల్లేందుకు సిద్ధమవుతున్నారు. కొందరు రైతులు వర్షాలు పడతాయనే ముందస్తు ఆలోచనతో పలుచోట్ల తమ పంట పొలాల్లో పత్తి విత్తనాలు నాటుతున్నారు. పత్తి పంటతో పాటు పెసర, మినుము, మొక్కజొన్న తదితర పంటలు సాగు చేసేందుకు రైతులు సమాయత్తమవుతున్నారు. కొన్నిచోట్ల వరి నారుమళ్ళ కోసం విత్తనాలు చల్లారు. అదునులో వర్షాలు పడటంతో మొత్తంగా పునాస పంటలు వేసేందుకు రైతులు బిజీగా ఉన్నారు.

దాడులను అరికట్టాలి

ప్రజాశక్తి - భవానీపురం : హింసకు కారణమవుతున్న మద్యంను రాష్ట్రంలో వెంటనే నిషేధించాలని, ఈ దిశగా నూతన ముఖ్యమంత్రిగా చంద్రబాబు తగిన చర్యలు తీసుకోవాలని గాంధీదేశం సోషల్ వెల్ఫేర్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు గాంధీ నాగరాజన్ సోమవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. అయితే ఒకరిపై ఒకరు చేసుకుంటున్న దాడులను అరికట్టాలని కోరారు. ప్రజాస్వామ్యంలో హింసకు తావులేదని, చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు ఈ మేరకు చర్యలు తీసుకుని రాష్ట్రంలో శాంతిని నెలకొల్పాలని ఆయన కోరారు.

స్ఫూర్తి ప్రదాత కోదండరామయ్య : వక్తలు



కోదండ రామయ్య కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న పెద్దలు

ప్రజాశక్తి-గన్నవరం : సామాజిక సేవలోనే కాదు, విద్యారంగం అభివద్ధిలో కీలక పాత్ర పోషించి ఎందరికో స్ఫూర్తి ప్రధాతగా వేములపల్లి కోదండ రామయ్య నిలిచారని పలువురు వక్తలు కొనియాడారు. సోమవారం గన్నవరం మండలం కేసరపల్లి గ్రామంలోని వికేఆర్ కళాశాలలో కాలేజ్ ఫౌండర్ వేములపల్లి కోదండ రామయ్య 110వ జయంతి సందర్భంగా కళాశాల ప్రాంగణంలో కోదండ రామయ్య కాంస్య విగ్రహాన్ని ఆయన మేనకోడలు మోటపర్తి రామచంద్రమ్మ, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ గద్దె అనురాధ ఆవిష్కరించారు. విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, మాజీ ఎమ్మెల్యే దాసరి వెంకట బాలవర్ధన్ రావు, మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వ రరావు, కళాశాల యాజమాన్య కమిటీ అధ్యక్షులు మోటపర్తి వెంకట్, కార్యదర్శి జి ఎల్ ఎస్ ఎన్ ప్రసాద్, కరస్పాండెంట్ పీవి రత్న ప్రసాద్ లు జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు కళాశాల యాజమాన్య కమిటీ అధ్యక్షులు వెంకట్ మోటపర్తి అధ్యక్షత వహించారు. ముందుగా మోటపర్తి రామచంద్రమ్మ మాట్లాడుతూ.. ఈ కళాశాల 55వ వసంతంలోకి అడుగుపెట్టిన శుభ తరుణంలో వేములపల్లి కోదండ రామయ్య కాంస్య తాను విగ్రహాన్ని ఆవిష్కరించటం ఎంతో అదష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు ఒకటే చెబుతున్న...సత్యం, న్యాయం, ధర్మం, ప్రేమ, పట్టుదల.. అనే పగ్గాలతో రథాన్ని లాగితే జీవితంలో ఉన్నత స్థాయికి చేరడం సులభమవుతుందన్నారు. సమాజ శ్రేయస్సు కోసం జీవితమంతా పాటుపడిన గొప్ప మహోన్నత వ్యక్తి అయినా కోదండరామయ్య జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శమని పేర్కొన్నారు. విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ మోహన్ రావు మాట్లాడుతూ.. గన్నవరం ప్రాంతంలో వికేఆర్ కళాశాల ఏర్పాటు చేయడం వల్లే తమలాంటి ఎంతోమంది విద్యార్థులు దీనిలో చదువుకొని ఉన్నత స్థాయిలో ఎదిగామని తెలిపారు. కోదండ రామయ్య గొప్ప వ్యక్తి అని కొనియాడారు. తాను వికేఆర్ కళాశాల స్టూడెంట్ అని చెప్పుకోవడానికి ఎంతో గర్వపడుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ గద్దె అనురాధ, కళాశాల కరస్పాండెంట్ పీ.వి. రత్న ప్రసాద్, పామర్రు ఎమ్మెల్యే కుమార్ రాజా,కళాశాల యాజమాన్య కమిటీ కోశాధికారి గూడవల్లి రాధా సుబ్బారావు, మాజీ కార్యదర్శి చింతపల్లి సీతారామయ్య, పెద్దలు గూడవల్లి నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ డి. శ్రీనివాసరావు పాల్గొన్నారు. అనంతరం కేక్ కట్ చేశారు. కళాశాల యాజమాన్య కమిటీ అధ్యక్షులు వెంకట్ మోటపర్తి, జి.ఎల్.ఎస్ ఎన్ ప్రసాద్ ఆధ్వర్యంలో అతిధులను దశ్యాలవాలతో సన్మానించారు. తొలుత కళాశాల మెయిన్ గేటు వద్ద ఏర్పాటుచేసిన మరో విగ్రహానికి ఆవిష్కరణ చేశారు.



కార్మికులతో మాట్లాడుతున్న వంకాయలపాటి రాణి

ఉపాధి పనులు పెంచాలి : వ్యకాస

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలో నత్త నడకన నడిచే ఉపాధి హామీ పథకం పనులు పెంచే విణంగా అధికారులు చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపద్యక్షురాలు వంకాయలపాటి రాణి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికలు తదితర కారణాల వల్ల ఉపాధి హామీ పనులు గుడ్లవల్లేరు మండలంలో నత్త నడకన సాగుతున్నాయని, వాటిని వెంటనే పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పారు. చంద్రాల పంచాయితీ పరిధిలోని ఉపాధి పనులను ఆమె స్థానిక నాయకులు బి.వి.శ్రీనివాసరావు తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొన్ని గ్రామాల్లో మెస్త్రీల వ్యవస్థ ఉన్న చోట సక్రమంగా పనులు బాగానే జరుగుతున్న విషయం గమనిచమన్నారు. మెస్త్రీల వ్యవస్థను పక్కన పెట్టి నడుపుతున్న చాలా ఇబ్బందులు వస్తున్నాయని పనులు సక్రమంగా జరటంలేదని విమర్శించారు. మెస్త్రీల వ్యవస్థను కాపాడుకోవలన్నారు. ఈ నెల 17 వతెదీ వడ్లమన్నాడు గ్రామంలో జరిగే మండల వ్యవసాయ కార్మిక సంఘం మహాసభకు జయప్రదం చెయ్యాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు మదిరి నాగరాజు. మెస్త్రీలు .మడిరి నాగమణి ,సుమలత తదితరులు పాల్గొన్నారు.

ఇది ప్రజా విజయం : బండి

ప్రజాశక్తి మచిలీపట్నం రూరల్ : ఎన్డీఏ కూటమి విజయం ప్రజా విజయం అని జనసేన మచిలీపట్నం ఇంచార్జి బండి రామక్రిష్ణ అన్నారు. సోమవారం మచిలీపట్నం 11 డివిజన్ ఇంచార్జ్ బండి కరుణాకర్ ఆద్వర్యంలో ఏర్పాటుచేసిన ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న జనసేన పార్టీ ఇంచార్జ్ బండి రామకష్ణ కేక్ కట్ చేసి జనసేన పార్టీ శ్రేణులతో ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా బండి రామకష్ణ మాట్లాడుతూ చారిత్రాత్మకమైన విజయాన్ని అందించారని, రాష్ట్ర ప్రజలు జనసేన పార్టీకి ఎన్డీఏ కూటమి అభ్యర్థుల విజయానికి రాష్ట్ర ప్రజల ఆశీస్సులు ఉన్నాయని రానున్న రోజుల్లో సుపరిపాలన అందించి ప్రజల నమ్మకాన్ని పరిపాలన ద్వారా నిలబెట్టుకుంటామని తెలిపారు. మచిలీపట్నం అభివద్ధి ఎంపి వల్లభనేని బాలసౌరి ఎం ఎల్ ఎ కొల్లు రవీంద్ర సహకారంతో శరవేగం పుంజు కుంటుందని తెలిపారు.జనసేన పార్టీ నగర అధ్యక్షుడు గడ్డంరాజు మాట్లాడుతూ గడిచిన ఐదు సంవత్సరాల్లో జనసేన పార్టీ మచిలీపట్నం నియోజకవర్గం లో అనేక సేవా కార్యక్రమాలు బండి రామకష్ణ ద్వారా చేపట్టామని ఎన్డీఏ ప్రభుత్వంలో మచిలీపట్నం దినదినాభివద్ధి చెందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు గడ్డంరాజు మహమ్మద్ సమీర్, వంపు గడవల చౌదరి, మహమ్మద్ భాషి,కర్రి మహేశ్,అరుణ్,తిరుమల శెట్టి రాజు, ప్రసాద్, గణేశ్, అరుణ్, సుదర్శన్, రామకష్ణ ,మోకా రవి డివిజన్ ఇన్చార్జిలు జనసేన పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న నాయకులు



పంచాయతీ చెరువును అభివృద్ధి చేయాలని వినతి

ప్రజాశక్తి-మోపిదేవి : మోపిదేవి మండలం మెరకనపల్లి గ్రామంలో గ్రామ పంచాయతీ చెరువులు అభివద్ధికి నోచుకోవటం లేదు. గత కొన్నేళ్లుగా చెరువు పూడికతీత, గట్ల బలోపేతానికి పంచాయతీ అధికారులు ఏ విధమైన చర్యలు చేపట్టలేదు. గ్రామ పంచాయతీకి చెరువులు ద్వారా లక్షలాది రూపాయలు ఆదాయం సమకూర్చుతున్న ఈ చెరువు అభివద్ధి విషయంలో పంచాయతీ సరైన శ్రద్ద చూపటం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ చెరువు అభివద్ధి చేయకపోవటంతో గట్లు బలహీనపడి భారీ వర్షాలు కురిసిన సమయాల్లో ముంపు సమస్య ఏర్పడుతోంది. బలహీన గట్ల మీదుగా చెరువు ముంపు నీరు పొలాల్లోకి చేరి రైతులు పంట నష్ట పోవలసివస్తున్నదని. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి చెరువు పూడిక తీయించి గట్లు బలోపేతం చేయించాలని రైతులు, గ్రామస్తులు కోరుతున్నారు.

ఘంటసాల పిహెచ్‌సిలో మెరుగైన వైద్య సేవలు

- డాక్టర్ వేమూరి ప్రమోద్ కుమార్

ప్రజాశక్తి-ఘంటసాల : మండల కేంద్రమైన ఘంటసాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఘంటసాల గోటకం గ్రామానికి చెందిన దేవబోయిన పద్మ పండంటి ఆడబిడ్డకు సోమవారం జన్మనిచ్చింది. ఈ సందర్భంగా ఘంటసాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని డాక్టర్ వేమూరి ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ నెలలు నిండిన పద్మ ఆసుపత్రికి రాగ పరీక్షించి ప్రసవం అయ్యే సూచనలు కనిపించడంతో వెంటనే ఆసుపత్రిలో చేర్పించాం అన్నారు. నొప్పులు పడుతున్న పద్మకు సిబ్బంది సహకా రంతో సుఖ ప్రసవం జరిగి ఆడబిడ్డకు జన్మ నిచ్చింది అన్నారు. తల్లిబిడ్డ క్షేమంగా ఉన్నారని డాక్టర్ తెలిపారు. ఘంటసాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కాన్పులు చేయడం తో సహా మెరుగైన వైద్య సేవలు అందిస్తు న్నామని ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసు కోవాలని కోరారు. సుఖప్రసవం జరిగేలా వైద్యసేవలు అందించిన వైద్యులకు, సిబ్బందికి పద్మ భర్త వేణు, కుటుంబ సభ్యులు కతజ్ఞతలు తెలియజేశారు. ఆసుపత్రిలో ప్రసవించిన పద్మకు ఘంటసాల సాయి సేవా సమితి సభ్యులు బేబీ కిట్ అందించడంతో పాటు ఆసుపత్రికి వైద్య పరీక్షలకు వచ్చిన గర్భిణీ స్త్రీలకు పండ్లు పంపిణీ చేశారు.



పద్మకు బేబీ కిట్ అందజేస్తున్న దృశ్యం

ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి-గన్నవరం : కేసరపల్లిలో ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం చేయబోయే సభాస్థలి ఏర్పాట్ల పనులు విజయవాడ ఎంపిగా ఎన్నికైన కేశినేని శివనాథ్, గన్నవరం ఎమ్మెల్యేగా ఎన్నికైన యార్లగడ్డ వెంకట్రావు పరిశీలించారు. సభ స్థలి ఏర్పాట్లతోపాటు అతిధులకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి దాదాపు మూడు లక్షల మందికి పైగా వస్తారని చెప్పారు. చంద్రబాబు నాయుడు మళ్ళీ ముఖ్యమంత్రి కావటంతో... రాష్ట్ర ప్రజలు ఎంతో ఆనందంగా ఉన్నారనీ అన్నారు. ప్రమాణ స్వీకారోత్సవానికి వైసీపీ దాడులలో గాయపడిన బాధితులు వస్తారన్నారు. బాధితులకు పార్టీ అండగా ఉంటుందని భరోసా, ధైర్యం కల్పిస్తాం అని తెలిపారు.

'బ్లూమ్ ఇన్ ఫ్లేమ్' కవితా సంపుటి ఆవిష్కరణ



కవితా సంపుటి ఆవిష్కరిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - గుడివాడ : తాత హనుమంతు రామచంద్రం, నాయనమ్మ విజయలక్ష్మిల సాహిత్య స్ఫూర్తితో చిన్న వయసులోనే ఆంగ్ల మాధ్యమంలో కవితలు రాసిన స్ఫూర్తి చంద్ర మరిన్ని రచనలు చేసి సాహితీ ప్రపంచంలో ధ్రువతారగా వెలుగొందాలని ఏఎన్నార్ కళాశాల విశ్రాంత తెలుగు శాఖాధిపతి డా॥కొడాలి సోమసుందరరావు పేర్కొన్నారు. ఆదివారం రాత్రి స్థానిక శోభన కాన్ఫరెన్స్ హాల్‌లో భారతీ సమితి అధ్యక్ష కార్యదర్శులు డి.ఆర్.బి ప్రసాద్ మోకా మాధవరావుల ఆధ్వర్యంలో ప్రవాస భారతీయులు శరత్‌చంద్ర, సునీతల కుమార్తె స్ఫూర్తి చంద్ర రచించిన బ్లూమ్ ఇన్ ఫ్లేమ్ పుస్తక ఆవిష్కరణ నిర్వహించారు. ఈ సందర్భంగా సోమసుందరరావు మాట్లాడుతూ సాహితీ కళా రంగాల్లో జాతీయ స్థాయిలో విశిష్టత కలిగిన మన పట్టణం నుండి స్ఫూర్తి చంద్ర తొలి రచన ఆవిష్కరణ కావడం గర్వకారణం అన్నారు. పుస్తక ఆవిష్కర్త ఎమ్.వి.జి ఆంజనేయులు మాట్లాడుతూ స్ఫూర్తి చంద్ర రచన లోతైన భావాలతో నిండి ఉన్నదని, రచనా శైలి ఆమెకు ఆంగ్ల భాషపై ఉన్న పట్టును తెలియజేస్తుం దన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు డా॥బండారు శ్యామ్‌కుమార్, జన్ను చిరంజీవిరావు, గాదె మోహనబాబు, కె.ఎస్ అప్పారావు, కోగంటి గాంధీబాబు, గొల్లేరు శ్రీనివాస్, వంగా శ్రీనివాస్, నరహరశెట్టి ప్రసాద్, మాట్టా రాజా, వసుధ బసవేశ్వరరావు, సయ్యద్ గఫార్, నూలు సాంబశివరావు, చింతలూరి సత్యనారాయణ, కె.రమేష్‌బాబు పాల్గొన్నారు.

వసంతకు పద్మశాలి సంఘం శుభాకాంక్షలు



వసంతకు అభినందనలు తెలుపుతున్న దృశ్యం

ప్రజాశక్తి - మైలవరం : ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో మైలవరం నియోజక వర్గం నుండి గెలుపొందిన వసంత కృష్ణ ప్రసాద్‌కు మైలవరం పద్మశాలి సంఘం సోమవారం ఐతవరంలోని ఆయన స్వగృహంలో శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధి కోసం కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మైలవరం పద్మశాలి సంఘం నాయకులు పాల్గొన్నారు.

జనసేన కార్యాలయంలో విజయోత్సవం



ప్రజాశక్తి - జగ్గయ్యపేట : జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్, జనసేన అభ్యర్థులు చారిత్రాత్మక విజయం సాధించిన సందర్భంగా సోమవారం పట్టణంలో స్థానిక కోదాడ రోడ్‌లో గల జనసేన కార్యలయంలో విజయోత్సవ వేడుకలు జనసేన పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీరాం చినబాబు పాల్గొని కేక్ కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ గెలుపులో పవన్ కళ్యాణ్, జనసైనికులు కృషి ఎంతో ఉందని, తప్పకుండా జనసైనికులకు తగిన గుర్తింపు ఇస్తాం అని తెలిపారు. కిషోర్ కుమార్ మాట్లాడుతూ ఇంతటి ఘన విజయం సాధించిన తాతయ్యకి శుభాభినందనలు తెలిపారు. తప్పకుండా జనసేన అందరికి సముచిత న్యాయం చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కృష్ణా జిల్లా సంయుక్త కార్యదర్శి ఈమని కిషోర్ కుమార్, చిరంజీవి యువత అధ్యక్షులు మోసిన్ అహ్మద్, లగడపాటి శంకర్, తునికపాటి శివ, గోపి, బాబులు, శైలజ, రాజు, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.



శుభాకాంక్షలు తెలుపుతున్న యుటిఎఫ్ నాయకులు

శ్రీరామ్‌కు యుటిఎఫ్ శుభాకాంక్షలు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : యుటిఎఫ్ ఎన్టీఆర్ జిల్లా సహాధ్యక్షులు ఎం.కృష్ణయ్య, జిల్లా కార్యదర్శి జె.సుధానంద్ ఆధ్వర్యంలో సోమవారం జగ్గయ్యపేట, వత్సవాయి, పెనుగంచిప్రోలు మండల శాఖల యుటిఎఫ్ బాధ్యులు, కార్యకర్తలు జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ (తాతయ్య)ని మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద పిల్లలకు ఉపయోగపడేలా మూడు మండల శాఖల బాధ్యులు విడివిడిగా తీసుకువచ్చిన నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్ళను స్థానిక శాసనసభ్యులకు అందజేశారు. జె.సుధానంద్ వ్యక్తిగతంగా తీసుకొచ్చిన నోటు పుస్తకాలను కూడా అందించారు. జగ్గయ్యపేట మండల శాఖ పక్షాన మండల శాఖ బాధ్యులు జి.పల్లవి, జి.ముక్తేశ్వరావు శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ (తాతయ్య)ని శాలువాలతో సత్కరించారు.

సిపిఐ శుభాకాంక్ష లు

శ్రీరాం తాతయ్య ఘనవిజయం సాధించిన సందర్భంగా ఆయనను సిపిఐ జగ్గయ్యపేట నియోజకవర్గ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్మికుల సమస్యలను పరిష్కరించేలా కృషి చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కార్యదర్శి అంబోజి శివాజీ, పట్టణ సిపిఐ కార్యదర్శి జూనెబోయిన శ్రీనివాసరావు, ఎఐటియుసి కార్యదర్శి పోతేపాక వెంకటేశ్వర్లు, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు నీలఖంఠం శివప్రసాద్, మాశెట్టి రమేష్, యాదగిరి, భోగ్యం నాగులు, ఏ ఐ వై యఫ్ అధ్యక్షులు యంద్రపల్లి భాను తదితరులు పాల్గొన్నారు.

'దేశభక్తికి నిదర్శనం ప్రతిజ్ఞ'

ప్రజాశక్తి - తిరువూరు :

ప్రతిజ్ఞ ఉద్దేశాలను అవగాహన చేసుకుంటే ప్రజాస్వామ్య విలువలను భిన్నత్వంలోని ఏకత్వాన్ని కాపాడుకోవచ్చని ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం కృష్ణా జిల్లా కార్యదర్శి రేపాక రఘునందన్ అన్నారు. సోమవారం ప్రతిజ్ఞ రచయిత పైడిమర్రి వెంకట సుబ్బారావు 108వ జయంతి స్థానిక హిందీ విద్యాలయంలో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో కలిసి పైడిమర్రి చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రఘునందన్ మాట్లాడుతూ మనమంతా భారతీయులమని ఘనంగా ఎలుగెత్తి చాటడానికి ప్రతిజ్ఞ ఒకటి చాలని, జాతీయ భావం దేశభక్తి భావన అభివృద్ధి చెందటానికి ప్రతిజ్ఞ ఎంతగానో దోహదం చేస్తుందని ప్రతిజ్ఞ మొదట 1962లో తెలుగులో రాయబడి తర్వాత అన్ని భారతీయ భాషల్లోకి అనువాదం చేయబడి దేశవ్యాప్తంగా విద్యార్థులందరూ ఆలపించడం తెలుగు వారందరికీ గర్వకారణమని అన్నారు. నిండైన దేశభక్తికి నిలువెత్తు నిదర్శనం ప్రతిజ్ఞ అని, విద్యార్థులు దానిలోని వాక్యాలు అర్థం చేసుకుని, ఆచరించి ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు.



ప్రతిజ్ఞ రచయిత పైడిమర్రి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రఘునందన్

దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం :

గడచిన సార్వత్రిక ఎన్నికలతో రాష్ట్రంలో కమ్ముకున్న కారు చీకట్లు వీడిపోయి ప్రజాపాలన వచ్చిందని, ఈ పోరాటంలో టిడిపికి ముస్లిం మైనార్టీలు వెన్నుదన్నుగా నిలిచారని మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు ఫారుక్ షుబ్లీ అన్నారు. ఈనెల 12న రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్న నారా చంద్రబాబునాయుడికి అల్లా ఆశీస్సులు ఉండాలని కోరుకుంటూ కొండపల్లిలోని సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం హజరత్ సయ్యద్ షాబుఖారీ బాబా దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మషాయక్ బోర్డు రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ జకావుద్దీన్‌తో కలిసి సోమవారం దర్గాని సందర్శించారు. ఈ సందర్భంగా ఫారుక్ షుబ్లీ మాట్లాడుతూ చంద్రబాబు పాలనలో మైనార్టీలకు తప్పకుండా పెద్దపీట వేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఒక మైనారిటీలు మాత్రమే కాకుండా చంద్రబాబు పాలనలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, అన్ని వర్గాలకు మంచి జరుగుతుందని అన్నారు. జకావుద్దీన్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక ముస్లిం మైనార్టీ నాయకులు షేక్ సర్వర్ సాహెబ్ (గోరే), మైలవరం నియోజకవర్గ ముస్లిం ఉపాధ్యక్షులు మహబూబ్ సుభాని, అప్సర్, మొయిన్, తదితరులు పాల్గొన్నారు.



దర్గాను సందర్శించిన షారుక్

పలుచోట్ల బాలకృష్ణ పుట్టిన రోజు వేడుకలు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ :

అద్భుత కళా నైపుణ్యం ఉన్న వ్యక్తి నందమూరి బాలకృష్ణ అని ఎపి ఫిల్మ్ ఛాంబర్స్ సభ్యులు కొల్లి అజయ్ కొనియాడారు. బాలకృష్ణ జన్మదినాన్ని పురస్కరించు కొని బాలకృష్ణ మొదటి సినిమా రిలీజ్ అయిన శ్రీ దుర్గా కళామందిర్ డీలక్స్‌లో వేడుకలు నిర్వహించారు. జన్మదిన వేడుకలను ఎపి ఫిల్మ్ ఛాంబర్స్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బాలకృష్ణ జన్మదినాన్ని పురస్కరించుకొని విజయవాడ గాంధీ నగర్‌లోని శ్రీ దుర్గా కళామందిర్ డీలక్స్‌లో కేక్ కట్ చేసి అభిమానులకు పంపిణీ చేశారు. ఈ వేడుకల్లో ఎపి ఫిలిం ఛాంబర్స్ వ్యవస్థాపక కోశాధికారి పాలెపు రామారావు, ఛాంబర్ ప్రతినిధులు, ఆచార్య ఎన్‌జి.రంగ ట్రస్ట్, మదర్ థెరిస్సా ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గోగినేని ధనశేఖర్, టీడీపీ రాష్ట్ర మహిళ జనరల్ సెక్రటరీ ములుపురి కల్యాణి ఛాంబర్ డిస్ట్రిబ్యూటర్స్, సభ్యులు పాల్గొన్నారు.

మైలవరం : సినీ హీరో, హిందూపురం ఎంఎల్ఎ బాలకృష్ణ జన్మదిన వేడుకలను మైలవరంలో టిడిపి ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు మల్లెలరాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం : సినీ హీరో, హిందూపురం హ్యాట్రిక్ ఎంఎల్ఎ నందమూరి బాలకృష్ణ పుట్టినరోజు సందర్భంగా కొండపల్లి టిడిపి కార్యాలయంలో మండల ప్రధాన కార్యదర్శి సాకిరి వెంకట నరసయ్య ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. కొండపల్లి పురపాలక సంఘం అధ్యక్షులు కౌన్సిలర్ చుట్టుకుదురు శ్రీనివాసరావు, కొండపల్లి మాజీ గ్రామ పార్టీ అధ్యక్షులు చిమాట ప్రసాద్, కౌన్సిలర్‌లు చుట్టుకుదురు వాసు, అడపా వెంకయ్య, కొరట శ్రీనివాసరావు, రాగాల జమలయ్య, తదితరులు పాల్గొన్నారు.

నందిగామ : నందిగామ నియోజకవర్గంలో బాలయ్య అభిమానులంతా వేడుకలు నిర్వహించారు. నందిగామ పట్టణం కాకాని నగర్ కార్యాలయంలో నిర్వహించిన బాలయ్య పుట్టినరోజు వేడుకల్లో శాసన సభ్యురాలు తంగిరాల సౌమ్య పాల్గొన్నారు. **భవానీపురం** : భవానీపురం శివాలయం సెంటర్లో నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలు తెలుగు యువత, పశ్చిమ టిడిపి నాయకుల ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు యువత ఆధ్వర్యంలో మైనార్టీ నాయకులు ఎంఎస్ బేగ్, గన్నే వెంకట నారాయణ ప్రసాదు కేక్ కట్ చేసి పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు యేదుపాటి రామయ్య, తదితరులు పాల్గొన్నారు.



విజయవాడలో శ్రీ దుర్గా కళామందిర్ డీలక్స్‌లో...



భవానీపురంలో...



మైలవరంలో...



ఇబ్రహీంపట్నంలో...



నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి - మైలవరం : పేద ఆర్యవైశ్య సంఘం సభ్యులకు మైలవరం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సోమవారం నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష కార్యదర్శులు బయ్యన శ్రీనివాసరావు, కాజా మహేష్, అనుమాలు పెద్ద అప్పారావు, అనుమాలు సత్యనారాయణ, సుకల సుబ్బారావు, జూలూరు నాని, మణికొండ చిన్ని, చారకొండ ప్రసాద్, శివ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాం తాతయ్య విజయంపై వేడుకలు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : 2024 సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి, శ్రీరాం తాతయ్య ఘనవిజయం సాధించిన సందర్భంగా పట్టణంలో 1వ వార్డు 45వ బూత్‌లో టిడిపి నాయకులు యలమర్తి అచ్యుతరామయ్య కేక్ కటింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య), నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులు నెట్టెం శివరామ్ పాల్గొని కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.



భువనేశ్వరిని కలిసిన సునీత

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: నిజం గెలవాలి నినాదంతో రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి ప్రజలను చైతన్యపరిచి టిడిపి కూటమి గెలుపులో కీలక పాత్ర వహించిన నారా భువనేశ్వరిని సోమవారం తెలుగునాడు అంగన్వాడీ, డ్వాక్రా సాధికార సంస్థ రాష్ట్ర అధ్యక్షురాలు ఆచంట సునీత మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

సౌమ్యకు మంత్రిగా ఆశీర్వదించాలి

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ నియోజకవర్గం తెలుగుదేశానికి కంచు కోట అని మరోసారి నిరూపించి భారీ మెజార్టీతో నందిగామ నియోజకవర్గాన్ని నారా చంద్రబాబు నాయుడికి గిఫ్ట్‌గా అందజేసినట్లు నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షుడు మార్కపుడి వరప్రసాద్ అన్నారు. సోమవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. సౌమ్యకు మంత్రి పదవిస్తే నియోజకవర్గంలో ఉన్న దళితులందరూ అభివృద్ధి పథంలో ముందుకు వెళ్తారని అగ్రవర్ణ పేద రైతులు అభివృద్ధి చెందుతారని ఆశిస్తూ వేడుకుంటున్నట్లు తెలిపారు.



సౌమ్యను అభినందిస్తున్న దృశ్యం

మురుగుతో తీవ్ర ఇబ్బందులు

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం మండలం కట్టుబడిపాలెంలో మురుగు ముంచేత్తింది. ఎస్‌సి కాలనీలో ఎటు చూసినా మురుగే కనిపిస్తుంది. మురికి నీటిలో నడిస్తే చర్మ వ్యాధులు వస్తాయని జనాలు భయపడుతున్నారు. పిల్లలను రోడ్లపైకి పంపడానికి వెనుకాడుతున్నారు. రోడ్లు పక్కనే ఉన్న కాల్వలోనూ, ఖాళీ స్థలాల్లోనూ నీరు నిలిచింది. దోమలకు నిలయంగా మారుతోందని చెబుతున్నారు. నీరు పోయేందుకు మార్గం లేకపోవడంతో నానా అగచాట్లు పడు తున్నామని మహిళలు వాపోతున్నారు. ఖాళీ స్థలాల్లో దట్టంగా మొలిచిన పిచ్చి మొక్కలతో పాటు నీరు చేరడంతో పాముల సంచారం ఎక్కువైందని భయపడుతున్నారు. రాత్రిళ్లురోడ్లపైకి రావాలంటే ఆలోచిస్తున్నారు. పంపుల్లో నీరు కలుషితమవడంతో డయేరియా వ్యాధులు వస్తాయని కంగారు పడుతున్నారు. అదే విధంగా ముదిరాజ్ పాలెంలో మురుగు పెద్ద ఎత్తున నిలిచింది. దీనికి తోడు జనాలు పెంటపోగులు వేయడంతో మరింత దారుణమైనపరిస్థితి నెలకొంది. ఎక్కడ చూసినా అపరిశుభ్రతే కనిపిస్తుందని చెబుతున్నారు. అంటురోగాలు వ్యాపించే అవకా శం ఉందంటున్నారు. చర్చికి సమీపంలో నీరు నిలిచింది. ఇలాంటి పరిస్థితుల్లో నీటి క్లోరినేషన్తో పాటు మురుగు నీరు బయటకు పోవడానికి నిధులు లేకపోవడంతో మావల్ల కాదని అధికారులు చేతులెత్తేశారని జనాలు తెలిపారు. సిమెంట్ రోడ్లు వేసినా డ్రెయిన్లు కట్టకపోవడంతో ఏకాలనీలో చూసినా మురుగు సమస్య కనిపిస్తుంది. ఈ పంచా యతీలో మూడు వేల జనాభా ఉంది. ఎటుచూసినా పేదలే కనిపిస్తారు. రెండు దళితవాడలున్నా వాటిల్లో సమస్యలు విలయతాండవం చేస్తున్నాయి. నీటిని బయటకు పంపడానికి అధి కారులు ఎవ్వరూ ముందుకు రాలేదు. అధికారులు చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని జనాలు విమర్శిస్తున్నారు. మండల స్థాయి అధికారులైన స్పందించి పంచాయతీ పరిధిలో మురుగు సమస్య నిర్మూలనకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.


రోడ్డుపై పారుతున్న మురుగు


మాట్లాడుతున్న ఎంటిఎంసి అధ్యక్షులు వేమారెడ్డి

వైసిపి శ్రేణులపై దాడులు సరికాదు

ప్రజాశక్తి-తాడేపల్లి : నియోజకవర్గంలో టిడిపి కార్యకర్తలు సాగిస్తున్న అరాచకాలను వైసిపి ఎంటిఎంసి అధ్యక్షులు డి.వేమారెడ్డి తీవ్రంగా ఖండించారు. సోమవారం మున్సిపల్ జోనల్ కార్యాలయం సమీపంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంగళగిరి వైసిపి కార్యకర్త రాజ్‌కుమార్‌పై జరిగిన దాడిని తప్పుబట్టారు. కిడ్నాప్ తరహాలో అజ్ఞాతంలోకి తీసుకెళ్లిన రాజ్‌కుమార్ ఆచూకీ ఇంతవరకు తెలియలేదన్నారు. దీంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారని చెప్పారు. ఎన్నికల వస్తూ ఉంటాయి పోతూ ఉంటాయని, ప్రజాస్వామ్యంలో గెలుపోటములు సహజమని స్పష్టం చేశారు. రాజకీయాల కోసం యువత తమ జీవితాన్ని నాశనం చేసుకోవద్దని సూచించారు. ఇటువంటి ఘటనలను ప్రోత్సహించవద్దని అన్ని రాజకీయ పార్టీలకు విజ్ఞప్తి చేశారు. ఓటమిని తమ పార్టీ అంగీకరిస్తుందని, దాడులు మంచి పద్ధతి కాదని చెప్పారు. సోషల్ మీడియా వేదికగా ఇరుపార్టీల కార్యకర్తలు హద్దు మీరిన మాట వాస్తవమేనని తెలిపారు. ఇప్పటికైనా పోలీసులు రాజ్‌కుమార్ ఎక్కడున్నాడో వెతికి కుటుంబ సభ్యులకు అప్పజెప్పాలని కోరారు. ఈ సమావేశంలో మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ డి.రామకృష్ణారెడ్డి, కృష్ణమూర్తి, యు.కల్యాణ్, ఎం.అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి : కలెక్టర్


బాబు. ఏ కు పుష్పగుచ్ఛం అందిస్తున్న కలెక్టర్ డిల్లీరావు

ప్రజాశక్తి-విజయవాడ : ఈ నెల 12న గన్నవరం మండలం, కేసరపల్లి గ్రామంలో ఐటీ పార్కు సమీపంలో రాష్ట్ర ముఖ్యమంత్రిగా గౌరవ నారా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం చేయనున్న నేపథ్యంలో కార్యక్రమానికి హాజరయ్యే వీవీఐపీ, వీఐపీ అతిథులకు మార్గదర్శకాలకు అనుగుణంగా సమన్వ యంతో పనిచేసి పటిష్ట ఏర్పాట్లు చేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టరేట్లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ లో లైజనింగ్ అధికారులు, ప్రత్యేక అధికారులు, కంట్రోల్ రూమ్ సిబ్బందితో కలెక్టర్ డిల్లీరావు, స్కూల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కమిషనర్ కాటంనేని భాస్కర్, ఏపీ డైరీ డెవలప్మెంట్ కోపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ బాబు ఏ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి హాజరయ్యే అతిథులకు వసతి, రవాణా తదితరాలకు సంబంధించి ప్రణాళిక ప్రకారం ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. వివిధ హోటళ్లకు ఇన్చార్జిలను కూడా నియమించినట్లు తెలిపారు. లైజనింగ్ అధికారులు కంట్రోల్ రూమ్ తో అనుసంధానమై వీవీఐపీ, వీఐపీలకు అవసరమయ్యే సౌకర్యాల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమ వేదిక పార్కింగ్ ప్రదేశాల్లో తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం తదితరాలపైన ప్రత్యేకంగా దష్టి సారించినట్లు తెలిపారు. సంబంధిత విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కషిచేయాలని సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ డా. పి సంపత్ కుమార్, అధికారులు ఉన్నారు.

కెయులో వైఎస్ఆర్ విగ్రహం తొలగింపునకు వినతి

ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి : మచిలీపట్నంలోని కృష్ణా విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ఉన్న మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని తొలగించాలని కోరుతూ సోమవారం విశ్వవిద్యాలయ ఉప కులపతి ఆచార్య జ్ఞానమణికి తెలుగునాడు స్టూడెంట్ ఫెడరేషన్ (టిఎన్ఎస్ఎఫ్) నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం సురేష్, జిల్లా నాయకులు అంగర మణి, తెలుగు యువత నాయకులు ఎమ్‌డి.సలీమ్ తదితరులు పాల్గొన్నారు.

వివాదాస్పద భూమిలో అక్రమ నిర్మాణం కూల్చివేత


పొక్లెయినర్‌తో అక్రమ కట్టడం కూల్చివేత

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి పట్టణంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి కాలనీ సమీపంలో వివాదాస్పద భూమిలో అక్రమ కట్టడాన్ని సోమవారం మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ అధికారులు, పోలీస్ బలగాలతో అక్రమ కట్టడానికి కూల్చివేశారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్నానికి చెందిన కే వెంకటేశ్వర్లు సర్వేనెంబర్ 142లో 46 సెంట్లు భూమిని 1984 ఏప్రిల్ 16వ తేదీన చింత క్రింది సూర్యనారాయణ కొనుగోలు చేశారు. అయితే తన మనవడు కే కృష్ణ కిషోర్ ఒక డాక్యుమెంట్ ఆధారంగా 44 సెంట్లు భూమిని వారసత్వంగా రిజిస్ట్రేషన్ చేయించుకుని మంగళగిరి తాసిల్దార్ కార్యాలయంలో పాస్ పుస్తకాలు పొందారు. దీనిపై చింతక్రింది సూర్యనారాయణ పోరాటం ఫలితంగా అప్పటి గుంటూరు జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు కుంచాల కృష్ణ కిపోర్ పాస్ పుస్తకాలను రద్దు పరిచి, రెవెన్యూ రికార్డులలో పేర్లు తొలగించారు. నిజమైన హక్కు దారుడైన చింతక్రింది సూర్యనారాయణ వద్ద నుండి మంగళగిరి పట్టణానికి చెందిన టిడిపి నాయకులు పోతినేని శ్రీనివాసరావు 2017 సంవత్సరం లో 34 సెంట్ల భూమిని కోనుగోలు చేశారు. రిజిస్ట్రేషన్ పక్రియ అనంతరం పోతినేని శ్రీనివాసరావు రెవెన్యూ రికార్డులలో తన పేరు నమోదు చేయించుకుని పాస్ పుస్తకాలు పోందారు. ల్యాండ్ కన్వెన్షన్ చేయించుకుని మున్సిపల్ టాక్స్ కడుతూ, సీఆర్డీయే అప్రూవల్ పోందారు. అప్పటినుండి ఈ భూమిపై టిడిపి నాయకులు పోతినేని శ్రీనివాసరావు, కే కృష్ణకిషోర్ల మధ్య వివాదం నెలకొని ఉంది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కృష్ణ కిషోర్ ఆ భూమి లోకి వెళ్లడం జరిగింది. అప్పటినుండి కృష్ణ కిషోర్ కు, పోతినేని శ్రీనివాసల మధ్య వివాదం జరుగుతూనే ఉంది. ఇటీవల ఆస్థలంలో కృష్ణ కిషోర్ అనుమతి లేకుండా భవనాన్ని నిర్మించడం జరిగింది. దీనిపై కార్పొరేషన్ అధికారులకు పోతినేని శ్రీనివాసరావు ఫిర్యాదు చేశారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి వచ్చింది. దీంతో ఈ భూ వివాదం మరలా చెలరేగింది. దీంతో సోమవారం అక్రమ కట్టడం జరిగిందని చెప్పి కార్పొరేషన్ అధికారులు, పోలీసుల బందోబస్తు మధ్య కూల్చివేయడం జరిగింది. కూల్చి వేసే సమయంలో పోలీసులు కృష్ణ కిషోర్ దగ్గర ఉన్న ఆధారాలు తీసుకురమ్మని చెప్పినప్పటికీ ఆయన చూపించకపోవడంతో భవనాన్ని కూల్చివేయడం జరిగింది.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

చేనేతలకు మంత్రి పదవి కేటాయించాలి

- ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ డిమాండ్

ప్రజాశక్తి - మంగళగిరి : చేనేతలు ఎదుర్కొంటున్న సమస్యల పట్ల అవగాహన కలిగి వాటికి పరిష్కారం జరగాలంటే చేనేత సామాజి వర్గానికి చెందిన వారికే మంత్రి పదవి కేటాయించాలని ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ జనరల్ సెక్రెటరీ డాక్టర్ సమతం మహేష్ డిమాండ్ చేశారు. మంగళగిరి నగరంలోని ప్రెస్ క్లబ్ లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ కార్యదర్శి సమతం మహేష్ మాట్లాడుతూ వ్యవసాయం తర్వాత అతిపెద్ద రంగంగా చేనేత పరిశ్రమ ఉందని కానీ గత 20 ఏళ్ల నుండి చేనేత రంగం తీవ్ర సంఘక్షోభంలోకి వెళ్లిందని ఉపాధి అవకాశాలు తగ్గిపోయి, ఈ వృత్తిపై ఆధారపడిన వారు ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేనేత పరిశ్రమను ఆదుకోవాలని, ప్రత్యేకించి రాష్ట్రంలో నూతనంగా ఏర్పడబోయే ఎన్డీఏ ప్రభుత్వంలో మా సమస్యల పట్ల పూర్తిస్థాయిలో క్షేత్రస్థాయిలో పరిష్కారం కావాలని దీనికి మా సామాజిక వర్గానికి మంత్రిత్వ శాఖను కేటాయించాలని డాక్టర్ సమతం మహేష్ కోరారు. ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు యనమల శివరాం ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా చేనేతలు 50 లక్షల మంది ఉన్నారని వీరంతా టిడిపి కూటమికి ఓట్లు వేసి గెలిపించారని మా చేనేత వర్గానికి నూతన ప్రభుత్వం సహాయం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, జాతీయ సభ్యులు పిల్లలమర్రి నాగేశ్వరావు ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వాస పల్లపు రాజు, రాష్ట్ర నాయకులు చింత నాగరాజు, నాయకులు రామనాథం పరమేశ్వరరావు, బత్తూరి మోహన్ రావు, గజవల్లి వెంకటకృష్ణ, దొడ్డి ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

తేనెటీగల దాడి

ప్రజాశక్తి-తాడేపల్లి : అమరావతి కరకట్టపై గల టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు ఇంటి ముందు సోమవారం తేనెటీగల దాడి జరిగింది. ఈ దాడితో హెరిటేజ్ ఉద్యోగి శివశ్రీనివాస్ తీవ్రంగా గాయపడ్డాడు. అక్కడే ఉన్న జాస్తి వీరాంజనేయులు, పోలీసు సిబ్బంది మల్లేశ్వరరావు, ఖాదర్‌బాష, రమేష్‌బాబు తేనెటీగలను తరిమివేశారు. దుప్పట్లు, సంచులతో బాధితుడికి కప్పి ఉపశమనం కలిపించారు. ఆపై విజయవాడ ఆసుపత్రికి తరలించారు. కరకట్టకు ఇరువైపులా చెట్లను శుభ్రం చేసే పనిలో ప్రొక్లెయినర్ పని చేస్తుండగా వాటిలో నుంచి తేనెటీగలు వచ్చి దాడి చేశాయి. 108 అంబులెన్స్‌కు ఫోన్ చేసినా వెంటనే స్పందించలేదని వీరాంజనేయులు తెలిపారు.

రాకేష్ మృతికి సంతాపం

పెనమలూరు : ఈనెల పదో తేదీన యాక్సిడెంట్‌లో మృతిచెందిన డ్యాన్సర్ రాకేష్ మరణం తీరని లోటని ప్రజానాట్యమండలి కృష్ణాజిల్లా కమిటీ విచారం వ్యక్తం చేసింది. చిన్న వయస్సు నుంచే డ్యాన్స్, నాటికలు అంటే ఇష్టంతో యనమలకుదురులోని ఎస్‌పి డ్యాన్స అకాడమీలో, ప్రజానాట్యమండలిలో శిక్షణ తీసుకొన్నారని ప్రజానాట్య మండలి నాయకులు తెలిపారు. ఒక ప్రముఖ టివీ వచ్చే డ్యాన్స్ షోలో రాణించారని అన్నారు. ఈ సందర్భంగా రాకేష్ మృతికి నాయకులు నివాళి అర్పించారు.



పురస్కార గ్రహీతలు

స్వర్ణ నంది పురస్కారం గ్రహీతలకు అభినందనలు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : హైదరాబాదులో నిర్వహించిన ఆదర్శ స్వర్ణ నంది పురస్కారంలో మన జగ్గయ్యపేటలోని సత్యా కూచిపూడి డాన్స్ అకాడమీ పాల్గొన్న 18 మంది విద్యార్థులు జగ్గయ్యపేటలో మొట్టమొదటిసారిగా స్వర్ణ నంది పురస్కార గ్రహీతలుగా నిలిచారు. వారికి సత్య కూచిపూడి డాన్స్ అకాడమీ యాజమాన్యం తరపున ఓగిరాల రామకృష్ణారావు, కూచిపూడి గురువులు కృష్ణవేణి, మానస, లావణ్య, దివ్యకు స్వర్ణనంది గ్రహీతలకు, వారి తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు. వారు చదువుతున్న పాఠశాల యాజమాన్యం వారు కూడా ఆ విద్యార్థులకు అభినందనలు తెలిపారు.



రాష్ట్ర చీఫ్ సెక్రటరీని కలిసిన జానీ పాషా

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చీఫ్ సెక్రటరీ నీరబ్ కుమార్ ప్రసాద్‌ను కలిసి గ్రామ వార్డు సచివాలయ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ అధ్యక్షులు ఎం.డి.జాని పాషా మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామ వార్డు సచివాలయ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.డి.జాని పాషా ఆధ్వర్యంలోని ఐదుగురు సభ్యుల బృందం, ఆంధ్రప్రదేశ్ చీఫ్ సెక్రటరీగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన నీరబ్ కుమార్ ప్రసాద్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గ్రామ వార్డు సచివాలయ ఎంప్లాయిస్ ప్రధానంగా ప్రమోషన్ చానెల్స్ గురించి, ప్రమోషన్‌తో పాటు పేస్కేల్ సవరణ చేయాలని అభ్యర్థిస్తూ తదితర అంశాలతో కూడిన ప్రధాన అంశాల గురించి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమం రాష్ట్ర అధ్యక్షులు ఎం.డి.జాని పాషా, రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.రోజా ప్రకాష్, సమాచార కార్యదర్శి యన్.రాజేష్ బాబు,రాష్ట్ర సమన్వయకర్త ఎం.శశిధర్,రాష్ట్ర సహాయ కార్యదర్శి జి.నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సౌమ్యకు సన్మానం

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ మండల మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మిక సంఘం (సిఐటియు) ఆధ్వర్యంలో సోమవారం నందిగామ ఎంఎల్‌ఎ తంగిరాల సౌమ్యను శాలువాలతో ఘనంగా సన్మానించి నూతన వస్త్రాలతో సత్కరించారు. నందిగామ మండల భోజన ఏజెన్సీ కార్మిక సంఘం అధ్యక్షురాలు ఆదూరి సుశీల, కార్యదర్శి తాటి తులశమ్మ, ఏజెన్సీ కార్మిక సంఘాల నాయకులు బొల్లినేని బేబి, దుర్గ, విజయలక్ష్మీ, మీరాబీ, కూచిపూడి సత్యవతి తదితరులు ఎంఎల్‌ఎ తంగిరాల సౌమ్యను ఘనంగా సన్మానించారు. నందిగామ మండల పరిధిలో మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మికులకు తమ వంతు సహకారం అందించాలని కోరారు. రాజకీయాలు అతీతంగా ఏజెన్సీ కార్మికులకు సేవ చేయాలని ఎంఎల్‌ఎ తంగిరాల సౌమ్య కు తెలిపారు. తొలుత నందిగామ మండల విద్యా శాఖ అధికారి పద్మను నూతన వస్త్రాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏజెన్సీ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రమాదకరంగా సిమెంట్ రోడ్డు

మూన్నాళ్ల ముచ్చటగా ఊర్మిళానగర్ - కబేళా రోడ్డు
ప్రమాదాల బారిన వాహనదారులు
- పట్టించుకోని విఎంసి అధికారులు

ప్రజాశక్తి - భవానీపురం :
పశ్చిమ నియోజకవర్గంలోని 43వ డివిజన్ ఊర్మిళానగర్ నుండి కబేళాకు వెళ్లు సిమెంట్ రోడ్డు బీటలు వారి ప్రమాదకరంగా తయారైంది. గత కొంతకాలంగా రోడ్డు ఇదే పరిస్థితి ఉన్నా పట్టించుకున్న నాధుడు లేడని వాహనదారులు, స్థానిక ప్రజలు వాపోతున్నారు. వివరాల్లోకి వెళ్తే 43వ డివిజన్ ప్రాంతంలో గత కొంతకాలం నిర్మించిన సిమెంట్ రోడ్డు బీటలు వారి సిమెంట్ దిమ్మెలతో పాటు ఇనుప చువ్వలు బయట పడ్డాయి. దీంతో అటుగా ప్రయాణించే వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నామని వాపోతున్నారు. ఈ రోడ్డు మార్గం గుండా ప్రతి నిత్యం వేలాది భారీ వాహనాలు ప్రయాణిస్తూ ఉంటాయి. ముఖ్యంగా హైదరాబాద్, పలు ప్రాంతాల నుంచి వచ్చే అనేక భారీ వాహనాలు, టిప్పర్లు, లారీలు గొల్లపూడి మీదుగా అట్కిన్‌సన్ స్కూల్ రోడ్డు నుండి హెచ్‌బి కన్వెన్షన్ నుండి కబేళాకు చేరుకుని, అటునుంచి చనుమోలు వెంకట్రావు ఫ్లైఓవర్ మీదుగా సింగ్‌నగర్ అవుట్‌కట్స్ నుంచి పలు ప్రాంతాలకు చేరుకుంటాయి. అయితే అట్కిన్‌సన్ నుండి కబేళాకు వెళ్లు మార్గం పోలేరమ్మ దేవస్థానంకు సమీపంలో సిమెంట్ రోడ్డు చాలావరకూ బీటలు వారింది. సిమెంట్ రోడ్డు పగుళ్లు ఇచ్చి రాళ్ళ మధ్యలో పెద్ద పెద్ద గ్యాప్ ఏర్పడి, ఇనుము బయటపడింది. ఇంత పెద్ద ఎత్తున రోడ్డు బీటలు వారితే కనీసం పట్టించుకున్న నాధుడు లేడని అంటున్నారు. లక్షలాది రూపాయలు ఖర్చుపెట్టి నిర్మించిన సిమెంట్ రోడ్డు బీటలు వారటంపై పలువురు మండిపడుతున్నారు. బీటలు వారి ప్రమాదకరంగా ఉన్న సిమెంట్ రోడ్డుకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేసి అందుబాటులోకి తేవాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.


బీటలు వారి ప్రమాదకరంగా తయారైన ఊర్మిళానగర్ నుంచి కబేళాకు వెళ్లు రోడ్డు మార్గం

రేడియో జాకీతో వినూత్న కార్యక్రమాలు

బెజవాడ టాకీస్ పేరుతో ప్రత్యేక ఈవెంట్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : రెడ్ ఎఫ్‌ఎమ్ తమ వినూత్న కార్యక్రమాల్లో మరో మెట్టెక్కుతూ, ప్రత్యేకంగా ఎంపిక చేసిన రెడ్ ఎఫ్‌ఎమ్ ఫాన్ క్లబ్ శ్రోతలచే కొత్త ఆర్జేను పరిచయం చేస్తుందని ప్రోగ్రామ్ హెడ్ ఆదిల్ భాషా తెలిపారు. నగరంలోని రెడ్ ఎఫ్.ఎం.కార్యాలయంలో సోమవారం నూతన రేడియో జాకీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా నూతన ఆర్జే అందించే సమాచారం వినూత్నంగా, ఆసక్తికరంగా ఉండబోతుందని అన్నారు. కొత్త ఆర్జే పేరు బెజవాడ రామ్. అని ఇతను రెడ్ ఎఫ్‌ఎమ్ 93.5 లో మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు "బెజవాడ టాకీస్" షో చేయబోతున్నారు అని తెలిపారు.. ఈ కొత్త ఆర్జే వినోదాన్ని మరింత హాస్యంగా అందరికీ దగ్గర చేయబోతున్నారు అని తెలిపారు. 'మేము శ్రోతల అభిరుచులను, వారి అభిప్రాయాలను మన్నిస్తూ ఈ కొత్త ఆర్జేను పరిచయం చేయడం మాకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఫాన్ క్లబ్ సభ్యులు తమ ఆదరణతో, ఉత్తేజంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారన్నారు. కొత్త ఆర్జే బెజవాడ రామ్ శ్రోతలను అలరిస్తూ, ప్రత్యేక కార్యక్రమాలు, ఆత్మీయ సంఘటనలు నిర్వహించబోతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న శ్రోతలకు స్టేషన్ హెడ్ క్రాంతి కుమార్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.



నూతన జాకీ పరిచయం కార్యక్రమం

దాడులపై సామినేని మండిపాటు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట :
టిడిపి దాడులకు ప్రతి దాడులుంటాయని జగ్గయ్యపేట మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను హెచ్చరించారు. నియోజకవర్గంలో వైసిపి కార్యకర్తలపై దాడులు, ఇళ్ళు, ఆస్తులను ధ్వంసం చేయడంపై ఆయన మండిపడ్డారు. సోమవారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో వైసిపి ముఖ్య నాయకులతో కలిసి ఉదయభాను విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇకనుంచి దాడులు ఆపకపోతే ప్రతి దాడులకు సైతం తాము వెనకాడబోమని స్పష్టం చేశారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఏనాడూ దాడులను ప్రోత్సహించలేదని చెప్పారు. వైసిపి కార్యకర్తలను విచక్షణరహితంగా కొట్టడం, ఇళ్ళపై రాళ్ళు విసిరి విలువైన వస్తువులను ధ్వంసం చేయడం, శిలాఫలకాలు, పార్టీ జెండా దిమ్మెలను కూల్చడం వంటి చర్యలపై ఉదయభాను ఆందోళన వ్యక్తం చేశారు. జగ్గయ్యపేట టిడిపి నాయకులు తక్షణమే స్పందించి దాడులను ఆపించాలని అన్నారు. కార్యకర్తలను అదుపులో ఉంచుకోవాలని చెప్పారు. దాడులపై పోలీసులకు ఫిర్యాదు చేస్తే నిందితులకు 41ఏ నోటీసు ఇచ్చి పంపిస్తున్నారని, ఇలాగైతే శాంతిభద్రతలు ఎలా అదుపులో ఉంటాయని ప్రశ్నించారు. పోలీసులు కఠినంగా వ్యవహరించాలన్నారు. నియోజకవర్గంలో కార్యకర్తలపై ఎక్కడెక్కడ దాడులు జరిగాయో, ఆస్తులు, శిలాఫలకాలు, జెండాదిమ్మెల ధ్వంసం వంటి ఘటనలను ఆయన వివరిస్తూ ఫోటోలను ప్రదర్శించారు. వైసిపి కార్యకర్తలెవరూ అధైర్యపడొద్దని, తాను అండగా ఉంటానని ఈ సందర్భంగా ఉదయభాను భరోసానిచ్చారు. ప్రజాతీర్పును గౌరవిస్తున్నామని, జగ్గయ్యపేట ఎమ్మెల్యేగా గెలుపొందిన శ్రీరాం రాజగోపాల్‌కి ఉదయభాను అభినందనలు తెలిపారు.


దాడులు చేసిన చిత్రపటాలను చూపిస్తున్న సామినేని ఉదయభాను

4కె ప్రీమియంతో నూతన ఎల్ఇడి టివి ఆవిష్కరణ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : అతిపెద్ద వినియోగదారు ఎలక్ట్రానిక్ బ్రాండ్ శామ్‌సంగ్ క్యూఎల్ఈడీ 4కె సిరీస్ ప్రీమియం టివిని ఆవిష్కరించినట్లు షోరూమ్ మేనేజర్ కె. రాంబాబు తెలిపారు. ఎం.జి.రోడ్డులోని షోరూమ్‌లో నూతన టివిలను పరిచయం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో ఎక్కువ మంది ఎల్ఇడి సిరీస్‌ను ఇష్టపడుతున్నారని వినియోగ దారుల అభిరుచికి అనుగుణంగా ఆ నూతన సిరీస్‌ను అందించడంలో శాంసంగ్ ముందుంటుందని తెలిపారు. క్యూఎల్ఇడి 4కె టీవీ సిరీస్ ప్రారంభ ధర రూ.65,990లుగా నిర్ణయించారన్నారు. అనేక ఫీచర్లతో మూడు సైజులు 55, 65, 75 సైజులలో లభిస్తుందన్నారు. క్వాంటం ప్రాసెసర్ లైట్ 4కె ద్వారా ఆధారితమైనదని తెలిపారు. క్వాంటం హెచ్‌డిఆర్‌తో 100 శాతం కలర్ వాల్యూమ్‌ను అందిస్తుందన్నారు. 4కె అప్‌స్కేలింగ్‌తో కూడా వస్తుందని దీనితో వినియోగదారులు అధిక రిజల్యూషన్‌తో 4కె మెటీరియల్‌ను వీక్షించవచ్చని తెలిపారు.

క్యాస్ట్రాల్ ఎడ్జ్ వినూత్న ప్రచార కార్యక్రమం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : లూబ్రికెంట్‌లో అగ్రగామిగా ఉన్న క్యాస్ట్రాల్ ఎడ్జ్ స్టే హెడ్ పేరుతో వినూత్న ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సంస్థ మార్కెటింగ్ హెడ్ రోహిత్ తల్వార్ తెలిపారు. ప్రచార కార్యక్రమాన్ని నగరంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్యాస్ట్రాల్ ఎడ్జ్ అనేది అధిక పనితీరు, గల ఆటోమొబైల్స్ కోసం రూపొందించారన్నారు. యస్‌యువి వాహనాలు, కార్లు హైబ్రిడ్‌లతో వివిధ వాహనాల కోసం ప్రత్యేకంగా రూపొందించినట్లు తెలిపారు. క్యాస్ట్రాల్ ఎడ్జ్ ఇంజన్ పనితీరు, వ్యాపార విస్తరణకు కొత్త ప్రమాణాలను అందిస్తుందన్నారు. ముఖ్యంగా వాహన ఇంజన్ మన్నికకు ఉపయోగపడుతుందన్నారు. క్యాస్ట్రాల్ ఎడ్జ్ ప్రచార కార్యక్రమం షారూఖ్ వాయిత్ వివిధ కార్యక్రమాలను రూపొందించి ప్రజలకు తెలియచేస్తున్నామన్నారు.

టీచర్ కోరట్లకు నివాళి

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ, చందర్లపాడు మండలాల్లో ప్రైవేటు స్కూల్ టీచర్‌గా సేవలందించిన కోరట్ల వెంకటేశ్వరరావు సంస్మరణ కార్యక్రమం సోమవారం నందిగామ భారత్ టాకీస్ సెంటర్‌లో ఆయన స్వగృహంలో జరిగింది. వెంకటేశ్వరరావు చిత్ర పఠానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ మాజీ నాయకులు కోరట్ల లక్ష్మీ నారాయణ, సిపిఎం నాయకులు ఖాసిం, ఎవి.నారాయణ, గిరిజన సంఘం నాయకులు వినుకొండ రామారావు, పలువురు వెంకటేశ్వరరావు చిత్ర పఠానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. వెంకటేశ్వర రావు సేవలను కొనియాడారు.


నివాళులు అర్పిస్తున్న దృశ్యం